RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ Nizamabad | సంపుటి : 03 Vol: 03 | సంచిక : 45 Vol: 45 | మార్చి 03 సోమవారం 2026 March 03 Monday 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి Editor : rachamallu madhavi | పేజీలు 08 Pages 08 | వెల : రూ. 6.00 Cost: Rs 6.00 |
|---|---|---|---|---|---|---|

## మూడోరోజూ ఉద్రిక్తతలు

- ఇప్పటికీ 550 మంది మృతి
- ఇరాన్ అధికారిక మీడియా ప్రకటన

2

## నేడు బ్లడ్ మూన్



హైదరాబాద్ **జనసంఘర్షణ**
మంగళవారం రాత్రి ఆకాశంలో అద్భుతమైన సంపూర్ణ చంద్రగ్రహణం ఆవిష్కృతం కానుంది, దీని ద్వారా ప్రపంచవ్యాప్తంగా 'బ్లడ్‌మూన్' కనువిందు చేయనుంది. మంగళవారం మధ్యాహ్నం 3:20 గంటల ప్రాంతంలో బ్లడ్‌మూన్ దశ ప్రారంభం కానున్నప్పటికీ, దీని అసలు ప్రభావం సాయంత్రం 4:34 గంటల నుండి మొదలవుతుంది. భారత దేశంలోని చాలా రాష్ట్రాల్లో ఈ దృశ్యాన్ని చూడాలంటే సూర్యాస్తమయం వరకు వేచి చూడాల్సి

➤ మిగతా 2వ పేజిలో..

## తిరుమల సహా అన్ని ఆలయాల మూసి వేత



తిరుపతి **జనసంఘర్షణ**
మార్చి 3వ తేదీ మంగళవారం నాడు ఏర్పడనున్న చంద్రగ్రహణం కారణంగా తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) ఆధ్వర్యంలోని స్థానిక అనుబంధ ఆలయాలన్నింటినీ మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. గ్రహణం మధ్యాహ్నం 3:20 గంటల నుండి

➤ మిగతా 2వ పేజిలో..

## దేశ భవిష్యత్తు కోసం మోడీపై యుద్ధం చేయాలి

### పీఏసీ సమావేశంలో రాహుల్ గాంధీ



వికారాబాద్ **జనసంఘర్షణ**
వికారాబాద్‌లో నిర్వహించిన కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశంలో పాల్గొన్న ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విధానాలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మోదీ ప్రభుత్వ దుర్మార్గపు చర్యలన్నీ క్రమంగా బయటపడుతున్నాయని, దేశ భవిష్యత్తును కాపాడుకునేందుకు కార్యకర్తలు యుద్ధానికి సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుత పరిస్థితులు కొనసాగితే భారత్‌కు ఇరాన్ వంటి దుస్థితి వచ్చే ప్రమాదం ఉందని, మోదీ తీరు వల్ల దేశం సంక్షోభంలో పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇండో-అమెరికన్ ట్రేడ్ డీల్ వల్ల దేశానికి ముప్పు పొంచి ఉందని హెచ్చరించిన రాహుల్, పార్టీ యంత్రాంగం అంతా ప్రజల్లోకి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ మరియు ప్రభుత్వం సమన్వయంతో

## నేడే హోలీ

### రంగుల పండుగపై గ్రహణం నీడ



హైదరాబాద్ **జనసంఘర్షణ**
భారతీయ సంస్కృతిలో వసంత రుతువుకు స్వాగతం పలుకుతూ జరుపుకునే రంగుల పండుగ 'హోలీ'కి ఈ ఏడాది ఒక ప్రత్యేకత తోడైంది. సుమారు వంద ఏళ్ల తర్వాత హోలీ పండుగ రోజే సంపూర్ణ చంద్రగ్రహణం (బ్లడ్ మూన్) రావడం ఖగోళ పరంగా, ఆధ్యాత్మిక పరంగా చర్చనీయాంశమైంది. ఫాల్గుణ పూర్ణిమ రోజున జరుపుకునే ఈ పండుగ చెడుపై మంచి సాధించిన

## దుబాయ్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

### క్షేమంగా ఉన్నానని సమాచారం



హైదరాబాద్ **జనసంఘర్షణ**
పశ్చిమ ఆసియాలో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కొనసాగుతున్న భీకర యుద్ధం కారణంగా గల్ఫ్ దేశాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల వల్ల తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దుబాయ్‌లో చిక్కుకుపోయారు. కుటుంబ సభ్యుల ఆరోగ్య చికిత్స నిమిత్తం ఐదు రోజుల క్రితం ఆయన దుబాయ్ వెళ్లగా, పర్యటన ముగించుకుని తిరిగి వచ్చే సమయంలో యుద్ధం తీవ్రరూపం దాల్చింది. భద్రతా కారణాల

➤ మిగతా 2వ పేజిలో..

## ఈ వేలంలో అక్రమాలు

### సీఎంకు కేటీ ఆర్ బహిరంగ లేఖ



హైదరాబాద్ **జనసంఘర్షణ**
సూర్యాపేట జిల్లాలో చేపట్టిన మైనింగ్ ఈ-వేలంలో భారీ ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపిస్తూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. సుమారు 1,100 ఎకరాల రిజర్వ్ ఫారెస్ట్ భూములపై స్పష్టత లేకుండానే వేలం నిర్వహించారని, కీలకమైన లాటిట్యూడ్, లాంగిట్యూడ్, డీజీపీఎస్ సర్వే వివరాలు మరియు జియోలాజికల్ నివేదికలను వెల్లడించలేదని ఆయన విమర్శించారు. మినరల్ ఆక్షన్ రూల్స్-2015ను ఉల్లంఘించడమే కాకుండా, తెలంగాణ హైకోర్టు ఇచ్చిన సూచనలను కూడా ప్రభుత్వం బేఖాతరు చేసిందని ఆరోపించారు. చట్టపరమైన మరియు పర్యావరణ అనుమతులు పూర్తి కాకముందే ప్రిఫర్డ్ బిడ్డర్లను ప్రకటించడంపై అనుమానాలు వ్యక్తం చేస్తూ, ప్రస్తుతం కొనసాగుతున్న మైనింగ్ టెండర్ ప్రక్రియను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేసులు ఎదుర్కొంటున్న డెక్కన్ సిమెంట్స్, ఎన్సీఎల్ ఇండస్ట్రీస్ వంటి కంపెనీలకు బ్లాక్‌లను కేటాయించడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ప్రశ్నించిన కేటీఆర్, గనుల శాఖ పారదర్శకతకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని

➤ మిగతా 2వ పేజిలో..

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
03 మంగళవారం, మార్చి 2026

# దేశ భవిష్యత్తు కోసం మోడీపై యుద్ధం చేయాలి

**మొదటిపేజీ తరువాయి..** అద్భుతంగా పనిచేస్తున్నాయని కొనియాడుతూనే, సామాజిక అంశాలపై మరింత దృష్టి సారించాలని కోరారు. ఇదే క్రమంలో బీసీ రిజర్వేషన్ల పెంపుదల కోసం పార్లమెంట్‌లో ప్రైవేటు బిల్లు తీసుకురావాలన్న సీనియర్ నాయకుడు వీహెచ్ ప్రతిపాదనకు రాహుల్ అంగీకారం తెలిపారు. అంతకుముందు శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న రాహుల్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. వికారాబాద్‌లోని ఎస్ఏపీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ భేటీలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, వైఎస్ షర్మిలతో పాటు పలువురు కీలక నేతలు పాల్గొన్నారు. పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడం, రాబోయే రాజ్యసభ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక, సంస్థాగత నిర్మాణం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. సమావేశం అనంతరం అనంతగిరి హిల్స్‌లో జరుగుతున్న డీసీసీ అధ్యక్షుల శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో పాల్గొనేందుకు రాహుల్ గాంధీ తరలివెళ్లారు. రాజ్యసభ సీట్ల రేసులో ఉన్న అభిషేక్ సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి, చిన్నారెడ్డి వంటి నేతల పేర్లను కూడా ఈ సందర్భంగా పరిశీలించినట్లు సమాచారం. మొత్తం మీద దేశంలో నెలకొన్న రాజకీయ పరిణామాలపై కార్యకర్తలను సమాయత్తం చేస్తూ, పార్టీని పటిష్ఠం చేసే దిశగా ఈ పర్యటన సాగింది.

# నేడు బ్లడ్ మూన్

**మొదటిపేజీ తరువాయి..** ఉంటుంది. తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే సాయంత్రం 6 గంటల తర్వాతే బ్లడ్‌మూన్ కనిపించే అవకాశం ఉంది, అలాగే గ్రహణం ముగిసే చివరి ఘట్టాన్ని కూడా వీక్షించవచ్చు. భూమి నీడ చంద్రునిపై పూర్తిగా పడినప్పుడు సంపూర్ణ చంద్రగ్రహణం ఏర్పడుతుందని, ఆ సమయంలో భూ వాతావరణం సూర్యకాంతిని వక్రీకరించి కేవలం ఎరుపు రంగు కిరణాలను మాత్రమే చంద్రునిపైకి ప్రసరింపజేస్తుందని ఖగోళ శాస్త్రవేత్తలు వివరించారు. దీనివల్ల చంద్రుడు ఎరుపు రంగులో మెరుస్తూ కనిపిస్తాడు కాబట్టే దీనిని 'బ్లడ్‌మూన్' అని పిలుస్తారు. చంద్రునిపై భూమి నీడ దాదాపు ఒక గంట రెండు నిమిషాల పాటు పడనుండగా, భారతదేశంలోని ప్రజలు దీనిని 7 నుండి 25 నిమిషాల పాటు మాత్రమే చూసే వీలుంటుంది. దేశ రాజధాని ఢిల్లీలో 20 నిమిషాలకు పైగా ఈ దృశ్యం కనిపిస్తుంది. భారతదేశంలోని తూర్పు మరియు ఈశాన్య ప్రాంతాలైన ఇటానగర్, గువహటి, సిలిగురి, కోల్‌కతా వంటి నగరాల్లో చంద్రోదయం త్వరగా అవుతుంది కాబట్టి, అక్కడ గ్రహణం అత్యంత స్పష్టంగా మరియు ఎక్కువ సమయం పాటు కనిపిస్తుందని శాస్త్రవేత్తలు వెల్లడించారు.

# తిరుమల సహా అన్ని ఆలయాల మూసి వేత

**మొదటిపేజీ తరువాయి..** సాయంత్రం 6:47 గంటల వరకు ఉండనుండగా, శాస్త్రోక్తంగా గ్రహణ సమయానికి ఆరు గంటల ముందుగానే ఆలయ ద్వారాలను మూసివేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో తిరుమల శ్రీవారి ఆలయాన్ని మంగళవారం మూసివేసి, తిరిగి బుధవారం వేకువజామున సంప్రోక్షణ అనంతరం తెరుస్తారు. తిరుపతి పరిసరాల్లోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం, శ్రీ గోవిందరాజస్వామి ఆలయం, శ్రీ కోదండరామస్వామి ఆలయం, శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటు అప్పలాయగుంట, నారాయణవనం, నాగలాపురం, కార్వేటినగరం, తరిగొండ వంటి ప్రాంతాల్లోని టిటిడి ఆలయాలన్నింటినీ మంగళవారం ఉదయం 9 గంటలకే మూసివేస్తారు. గ్రహణ సమయం ముగిసిన తర్వాత రాత్రి 7:30 గంటలకు ఆలయ తలుపులు తెరిచి, శుద్ధి మరియు పుణ్యాహవచనం వంటి వైదిక కైంకర్యాలను నిర్వహిస్తారు. ఈ శుద్ధి కార్యక్రమాల అనంతరం రాత్రి 8 గంటల నుండి 9 గంటల మధ్యలో ఆయా ఆలయాల నిబంధనల మేరకు భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. చంద్రగ్రహణం నేపథ్యంలో భక్తులు ఈ సమయాలను గమనించి తమ దర్శన ప్రయాణాలను ప్లాన్ చేసుకోవాలని ఆలయ అధికారులు సూచించారు. ఆకాశంలో అద్భుత ఘట్టంగా ఆవిష్కృతమయ్యే ఈ బ్లడ్‌మూన్ లేదా సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా ఆలయాల్లో నిర్వహించే నిత్య కైంకర్యాల్లో కూడా మార్పులు చోటు చేసుకున్నాయి. మంగళవారం రాత్రి గ్రహణ మోక్షం తర్వాత ఆలయాలను పునఃప్రారంభించి శాంతి పూజలు నిర్వహించిన తర్వాతే భక్తులకు భగవంతుని దర్శనం కల్పించడం జరుగుతుంది.

## ఫిర్యాదుదారుడి పట్ల కలెక్టర్ ఉదారత

### చేతికి గాయం చూసి వైద్య సాయానికి ఆదేశం

జనగామ, మార్చి2 : జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తొలి సారి నిర్వహించిన ప్రజావాణిలో ఓ అరుదైన సంఘటన చోటు చేసుకుంది. జిల్లాలోని కొడకండ్ల మండల కేంద్రానికి చెందిన చెరుకు సోమనర్సయ్య తన భూ సమస్య పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి రాగా అర్జీదారుడి చేతిపై దురదతో వాపు ఉండడాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ గమనించారు. చేతికి ఏమైందని బాధితుడిని కలెక్టర్ అడగ్గా మూడు రోజుల క్రితం చేతిపై జెర్రి పాకిందని సోమనర్సయ తెలుపడంతో అతడిని వెంటనే వైద్య చికిత్స కోసం ప్రభుత్వ దవాఖానకు పంపించాలని డీఎంహెచ్ వోను ఆదేశించారు. బాధితుడికి ఒక వ్యక్తిని సహాయంగా హాస్పిటల్‌కు పంపించి చికిత్సను అందించారు. డాక్టర్ల సూచన మేరకు అవసరమైన మందులు తీసుకున్న బాధితుడు ఆ తర్వాత మళ్లీ ప్రజావాణిలో కలెక్టర్‌ను కలిసి వైద్య సహాయం అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

# నిమ్జ్‌లో మౌలిక వసతుల అభివృద్ధి

### జిల్లా కలెక్టర్ సమీక్ష



**జహీరాబాద్**
జహీరాబాద్ పరిధిలోని నిమ్జ్ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో నిమ్జ్ భూముల సరిహద్దుల గుర్తింపు, ఫెంచింగ్, సమీప రహదారుల అభివృద్ధి, నిమ్స్‌కు అనుసంధానించే ముఖ్య మార్గాల విస్తరణ వంటి అంశాలపై నిమ్జ్, టీజీఐఐసీ, సర్వే, రెవిన్యూ అధికారులు సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మౌలిక వసతులు కల్పించే ఎస్ఆర్ఆర్ కన్స్ట్రక్షన్ కంపెనీకి ఇప్పటి వరకు సేకరించిన భూములను అప్పగించాలని సూచించారు. లే అవుట్ అభివృద్ధి కోసం పది రోజుల్లో సర్వే పూర్తి చేయాలని, భూముల్లో రోడ్లు, ఇతర సదుపాయాల కోసం హద్దురాళ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గతంలో భూములు స్వాధీనం తీసుకొని రైతులకు నష్టపరిహారం చెల్లించామని, కానీ అభివృద్ధి పనులు ఆలస్యంగా ప్రారంభం కాకపోవడంతో తాత్కాలికంగా పంటలు సాగు చేసుకునేందుకు అనుమతించామని కలెక్టర్ వివరించారు. అభివృద్ధి పనులు ప్రారంభమవుతున్నందున కొత్త పంటలు వేయకుండా చూసుకోవాలని, ఇప్పటికే ఉన్న పంటలు కోత పూర్తయ్యే వరకు వేచి ఉండాలని సూచించారు. కలెక్టర్ సర్వే ఎటువంటి ఆటంకం లేకుండా, శాంతియుత వాతావరణంలో జరగాలని అధికారులు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సర్వే సందర్భంగా హద్దురాళ్లను రైతులు తొలగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ విఠల్, జహీరాబాద్ ఆర్డీవో దేవుజా, నిమ్జ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ విశాలాక్షి, తాహిల్దార్లు పాల్గొన్నారు..

# ఈ వేలంలో అక్రమాలు

**మొదటిపేజీ తరువాయి..** మండిపడ్డారు. మైన్స్ అండ్ జియోలజీ శాఖ లీగల్ ఆఫీసర్ సమాచారాన్ని గోప్యంగా ఉంచడం అక్రమాలకు నిదర్శనమని, ఈ వ్యవహారంపై స్వతంత్ర విచారణ జరిపించాలని కోరారు. అన్ని రకాల శాస్త్రీయ సర్వేలు నిర్వహించి, అటవీ అనుమతులు పొందిన తర్వాతే పారదర్శకంగా కొత్త టెండర్లు జారీ చేయాలని హితవు పలికారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి ఈ విషయంలో తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరుతూ, ఈ లేఖ ప్రతులను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు మరియు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కూడా పంపినట్లు కేటీఆర్ పేర్కొన్నారు.

# నేడే హోలీ

**మొదటిపేజీ తరువాయి..** విజయానికి చిహ్నం. భక్త ప్రహ్లాదుడిని కాపాడి, అహంకారి అయిన హిరణ్యకశ్యపుడిని వధించిన నరసింహస్వామి లీలను స్మరించుకుంటూ ఈ వేడుకలు నిర్వహిస్తారు. సాధారణంగా హోలీకి ముందు రోజు రాత్రి 'హోలికా దహనం' నిర్వహిస్తారు. అయితే ఈసారి మార్చి 3న మధ్యాహ్నం 3:20 నుండి సాయంత్రం 6:47 వరకు చంద్రగ్రహణం ఉండటంతో ముహూర్తాల విషయంలో కొంత గందరగోళం నెలకొంది. గ్రహణానికి 9 గంటల ముందే 'సూతకం' ప్రారంభం అవుతుంది కాబట్టి, మార్చి 3వ తేదీ సాయంత్రం గ్రహణం ముగిసిన తర్వాతే (రాత్రి 6:47 గంటల అనంతరం) హోలికా దహనం నిర్వహించడం శ్రేయస్కరమని పండితులు సూచిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో మార్చి 2వ తేదీ రాత్రి భద్రకాలం ముగిశాక కూడా ఈ కార్యక్రమాన్ని జరుపుకుంటున్నారు. ఈ ఖగోళ మార్పుల వల్ల దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పండుగ తేదీల్లో స్వల్ప మార్పులు ఉన్నాయి: తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్: తెలుగు రాష్ట్రాల్లో మార్చి 3నే ప్రధానంగా హోలీ వేడుకలు జరుపుకుంటున్నారు. అయితే గ్రహణం కారణంగా సాయంత్రం వేళ ఆలయాలు మూసివేస్తారు. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల్లో మార్చి 4వ తేదీన కూడా రంగుల హోలీ (ధూళివందనం) జరుపుకోవడానికి సిద్ధమవుతున్నారు. హోలీ అంటే కేవలం రంగులు చల్లుకోవడం మాత్రమే కాదు, మనుషుల మధ్య ఉన్న విద్వేషాలను మరిచిపోయి స్నేహహస్తాన్ని అందించడం. ప్రకృతి సిద్ధమైన రంగులతో (చీఫ్‌బత్ఖుశ్రీ జశీశ్రీశీతీం) పండుగను జరుపుకోవడం వల్ల అటు ఆరోగ్యం, ఇటు పర్యావరణం రెండూ సురక్షితంగా ఉంటాయి. గ్రహణ సమయం ఉన్నందున గర్భిణీలు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ, గ్రహణ మోక్షం తర్వాత స్నానాదులు ముగించి వేడుకల్లో పాల్గొనడం ఉత్తమం.

## దుబాయ్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు

**మొదటిపేజీ తరువాయి..** దృష్ట్యా దుబాయ్ సహా పలు గల్ఫ్ దేశాలు తమ గగనతలాన్ని మూసివేయడంతో విమాన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ఆదివారం అర్ధరాత్రి దుబాయ్ విమానాశ్రయ టెర్మినల్-3 సమీపంలో క్షిపణి దాడులు జరిగినట్లు సమాచారం అందడంతో అక్కడి ప్రభుత్వం విమాన సర్వీసులను రద్దు చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో

# ఉప్పల్ డివిజన్‌కు భారీగా నిధులు

- రూ.40 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం
- కాలనీవాసులకు ప్రొసీడింగ్స్
- అందజేసిన మందుముల పరమేశ్వర్ రెడ్డి



ఉప్పల్ : ఉప్పల్ డివిజన్ అభివృద్ధికి మరోసారి భారీగా నిధులు మంజూరు చేయించుకున్నట్లు ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉప్పల్ డివిజన్‌ను ఆదర్శ డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఉప్పల్ డివిజన్‌లోని శ్రీశక్తి కాలనీలో సీసీ రోడ్డు లేకపోవడంతో వర్షాకాలంలో మట్టి, గుంతలు ఏర్పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని కాలనీవాసులు గతంలో విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. దీనికి స్పందించిన పరమేశ్వర్ రెడ్డి సంబంధిత అధికారులతో చర్చించి రూ. 40 లక్షల నిధులు మంజూరు చేయించుకున్నారు. శ్రీశక్తి కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం మరియు మరమ్మతుల కోసం మంజూరైన నిధుల ప్రొసీడింగ్స్‌ను కాలనీ అసోసియేషన్ ప్రతినిధులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల అవసరాలే తమకు ప్రాధాన్యమని, కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీశక్తి కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు సి. శ్రీనివాసులు రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ వరుణ్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఈ. శంకరయ్య, ప్రధాన కార్యదర్శి టి. కమలాకర్, సభ్యులు రాజు, వెంకట సుబ్బారావు, సిహెచ్ ప్రకాష్ రావు, మామిండ్ల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీరామ సహిత సత్యనారాయణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



**ఉప్పల్ :** శ్రీరామ సహిత సత్యనారాయణ స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించబడ్డాయి. వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు నిర్వహించగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. పుష్పాలంకరణలు, దీపాలంకరణల మధ్య జరిగిన వేడుకలు భక్తులను ఆధ్యాత్మికానందంలో ముంచెత్తాయి. ఈ కార్యక్రమానికి ఉప్పల్ మాజీ శాసనసభ్యులు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, మాజీ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్రావు, రామంతపూర్ డివిజన్ అధ్యక్షులు వంగాల సంతోష్ గుప్తా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. స్వామివారి ఆశీస్సులు తీసుకుని సమాజ శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు.
వార్షికోత్సవాల సందర్భంగా ఆలయ ఈవో విజయభారతి అతిథులను ఘనంగా సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ నిర్వహణలో భక్తుల సహకారం అభినందనీయం అని పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రేవు నరసింహ కురుమ, వల్లపు జగన్ యాదవ్, తాళ్ల బాలకృష్ణ గౌడ్, ఉలుగొండ నారాయణదాసు, పోరెడ్డి మహేశ్వర్ రెడ్డి, తమ్మలి రవి, కల్మకళ్ల లింగం, బొడ్డుపల్లి లింగం, స్వర్ణ సండే, వీణ, కీర్తి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలు ఘనంగా జరగడంతో భక్తులు ఆనందం వ్యక్తం చేస్తూ స్వామివారి కృపతో అందరూ ఆయురారోగ్యాలతో సుఖశాంతులతో ఉండాలని ప్రార్థించారు.

# అక్రమ ఇసుక తరలింపు చేస్తున్న కాంట్రాక్టర్ పైన ఆగ్రహం

- ఆగ్రహం వ్యక్తం చేసిన బీర్కూర్ గ్రామ సర్పంచ్ ధర్మతేజ
- పేరు చెక్ డ్యామ్ తరలించేది బయట మార్కెట్లోకి
- కోట్లు దండుకుంటున్న కాంట్రాక్టర్..
- అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లు అడ్డుకున్న గ్రామ సర్పంచ్ ధర్మ తేజ.
- అధికార పార్టీ అండదండలతోఅడ్డుకుంటే... వదిలేశారు



కామారెడ్డి జిల్లా / బీర్కూర్ / మార్చ్ 2 (జన సంఘర్షణ )

2021లో మంజీరా నది పర్యాయక ప్రాంతంలో భూగర్భ జలాలు పెంపొందించాలని లక్ష్యంతో, అప్పటి శాసనసభ పతి, ప్రస్తుత బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ,కామారెడ్డి జిల్లా బీర్కూర్ మంజీరా నదిలో చెక్ డ్యామ్ నిర్మాణం పనులకు 30 కోట్ల రూపాయలు వెచ్చించి, ఐదేళ్ల క్రితం చెక్ డ్యామ్ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. కానీ చెక్ డ్యామ్ నిర్మాణం కాకుండానే ,ఐదేళ్లలో కోట్లాది రూపాయల ఇసుక దోపిడీకి గురైంది. దీంట్లో అధికార పార్టీకి నేతలు, కీలక నేతల కుమారులు ఈ ఇసుక మాఫియా అవతారం ఎత్తి పెద్ద ఎత్తున ఇసుక తరలించకపోయి కోట్లు సంపాదించుకున్నారు. ఈ కథ ఇలా ఉంటే. చెక్ డ్యామ్ నిర్మాణం పనులు చేపట్టిన కాంట్రాక్టర్ చెక్ డ్యామ్ నిర్మాణం పనుల కోసం మంజీరా నది ఒడ్డున మిక్సింగ్ ప్లాంట్ వేసుకున్నారు. ఇక్కడ మిక్సింగ్ చేసిన కంకర ,సిమెంట్ ఇసుక చెక్ డ్యామ్ నిర్మాణం పనులకు తరలించాలి. కానీ ఐదేళ్లు గడుస్తున్నా పనులు మాత్రం పునాదికే పెట్టి పెద్ద ఎత్తున చెక్ డ్యామ్ పేరు చెప్పి బోధన్, బాన్సువాడ, ఎల్లారెడ్డి ప్రాంతంలో ఈ ఐదేళ్ల కాలంలో 300 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు ఇక్కడ మంజీరా నదిలోని, ఇసుక ప్రభుత్వానికి ఎలాంటి సినార్జీ డబ్బులు చెల్లించకుండా ఈ ప్లాంటు లో మిక్సింగ్ చేసిఇతర నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనులకు తరలించక పోయారు. వీరికి అప్పుడు అధికార పార్టీ నాయకుల అండదండలు, ఇప్పుడు అదే పార్టీకి చెందిన నాయకులు, మళ్లీ అధికార పార్టీ అండదండలు ఉండడంతో చెక్ డ్యామ్, కాంట్రాక్ పెద్ద ఎత్తున ఇసుక దోపిడికి పాల్పడుతున్నారు. గ్రామపంచాయతీకి ఇప్పటివరకు నయా పైసా సీనర్జి డబ్బులు రాలేదంటే, ఏ స్థాయిలో వీరి అధికార బలం ఎలా సాగుతుందో స్పష్టంగా తెలుస్తుంది. ఒకటి కాదు రెండు కాదు ,ఐదు ఏళ్ల పాటు ఈ కాంట్రాక్టర్ ఇసుక మాఫియా తో, పోటీపడుతూ మంజీరా నదిలోని ఇసుకను మిక్సింగ్ ప్లాంట్ లో మిక్సింగ్ చేసుకొని భారీ ఎత్తున, ఇతర నియోజకవర్గంలో జరిగే కాంట్రాక్టు పనులకు తరలించకపోయి కోట్లు దండుకున్నారు. పగలు ,రాత్రి అనే తేడా లేకుండా ఈ చెక్ డ్యామ్ కాంట్రాక్టర్ మిక్సింగ్ ప్లాంట్లో మిక్సింగ్ చేసుకుంటూ, బయట కాంట్రాక్ట్ పనులకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో బాన్సువాడ కాంగ్రెస్ ఇంచార్జి ఏనుగు రవీందర్ రెడ్డి, ఈ మిక్సింగ్ ప్లాంట్ కు వచ్చి ఇక్కడి నుంచి బయటకు ఒక్క టిప్పర్ కూడా బయట తరలిస్తే మిక్సింగ్ ప్లాంట్ ను సీజ్ చేస్తానని హెచ్చరించారు. అయినప్పటికీ కాంట్రాక్టర్ కు కీలక నేతల అండదండలు ఉండడం, స్థానిక అధికార పార్టీ నాయకుల అండదండలు ఉండడంతో బీర్కూర్ మంజీరా నదిలో చెక్ డ్యామ్ ఐదేళ్ల నుంచి నత్తనడకన పనులు చేస్తూ, చెక్ డ్యామ్ పేరు చెప్పి కోట్లాది రూపాయల విలువచేసే, ఇసుక మిక్సింగ్ చేసుకుంటూ బాన్స్వాడ, బోధన్, ఎల్లారెడ్డి ప్రాంతాల్లో 300 కోట్ల రూపాయల పైగా జరిగే అభివృద్ధి పనులకు తరలించక పోయారు. అయినప్పటికీ మైనింగ్ శాఖ మామూళ్ల మత్తులో మునిగితేలుతుంది. సోమవారం పట్టపగలే మిక్సింగ్ ప్లాంట్ లో మిక్సింగ్ చేసుకొని ఇతర ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు దర్జాగా తరలిస్తుండగా, గ్రామ సర్పంచ్ ధర్మ తేజ ఆధ్వర్యంలో గ్రామస్తులు అడ్డుకున్నారు, చెక్ డాం నిర్మాణం కోసం మిక్సింగ్ ప్లాంట్ వినియోగించుకోవాలి కానీ, అక్కడ మిక్సింగ్ చేసింది ఎక్కడికి తరలిస్తున్నారు. టిప్పర్ డ్రైవర్లు ప్రశ్నిస్తే సమాధానం రాలేకపోయింది. ఈ విషయంపై సర్పంచ్ ధర్మతేజ జిల్లా కలెక్టర్కు, స్థానిక తాసిల్దార్ కు ఫిర్యాదు చేశారు. మిక్సింగ్ ప్లాంట్ నుంచి ఇతర ప్రాంతాలకు మిక్సింగ్ ఎక్కడికి తీసుకు వెళ్ళరాదని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలియజేసినట్లు గ్రామ సర్పంచ్ ధర్మతేజ వెల్లడించారు. ఐదేళ్లుగా ఈ చెక్ డ్యామ్ కాంట్రాక్టర్ చెక్ డ్యామ్ నిర్మాణం పనులకు ఉచితంగానే ఇసుక వాడుకుంటూ, మరొక పక్కా ఇతర నియోజకవర్గంలో జరిగే అభివృద్ధి పనులకు ఇక్కడి నుంచే మిక్సింగ్ ప్లాంట్ లో ఇసుక కంకర సిమెంట్ మిక్సింగ్ చేసుకొని అభివృద్ధి పనులకు వాడుకుంటూ కోట్లు దండుకుంటున్నారు. కానీ చెక్ డ్యామ్ నిర్మాణం పనులు ఐదేళ్లు గడుస్తున్నా, అవి పునాదితో నత్త తో పోటీ పడుతూ పనులు సాగుతున్నాయి. ఎన్ని రోజులు ఆలస్యమైతే అన్ని రోజులు ఈ కాంట్రాక్టర్కు బీర్కూర్ మంజీరా నది బంగారు బాతు గుడ్డుగా మారుతుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని ఉద్దేశపూర్వకంగా ఐదేళ్ల నుంచి చెక్ డ్యామ్ పనులు వేగవంతంగా చేయకుండా ఇష్టం వచ్చినప్పుడు పనులు చేస్తూ, చెక్ డ్యామ్ నిర్మాణం పనుల కోసం ఏర్పాటు చేసుకున్న మిక్సింగ్ ప్లాంట్, నుంచి పెద్ద ఎత్తున ఇతర ప్రాంతాల్లో ఆయన చేపడుతున్న కాంట్రాక్ట్ పనుల కోసం తరలిస్తున్నారు. వీటిని అడ్డుకోవాల్సిన రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖ, మైనింగ్ శాఖ మామూళ్ల మత్తులో మునిగితేలుతున్నారు. సోమవారం పట్టపగలే మంజీరా నది నుంచి అక్రమంగా మిక్సింగ్ చేసుకొని ఇతర పంటలకు తరలిపోతుండగా గ్రామ సర్పంచ్ ధర్మ తేజ, గ్రామస్తులు టిప్పర్లు అడ్డుకోగా ఆ టిప్పర్లు పోలీస్ స్టేషన్లో పెట్టాల్సిన ఎస్సై మహేందర్, గ్రామస్తులను పక్కకు పంపించి టిప్పర్లు ఇతర ప్రాంతాలకు తరలించారు. ఇదండీ మన పోలీస్ శాఖ పనితీరు. అడ్డంగా అక్రమంగా టిప్పర్ లోమిక్సింగ్ ఇతర ప్రాంతాలకు వెళుతుంటే ఏకంగా గ్రామ సర్పంచి పట్టుకుంటే ,ఆ టిప్పర్లు పోలీస్స్టేషన్లో పెట్టాల్సిన ఎస్సై ఆ కాంట్రాక్టర్కు కొమ్ముకాస్తూ టిప్పర్లు పంపించడం ఎస్సై పనితీరుపై సర్పంచ్ ధర్మతేజ అసహనం వ్యక్తం చేశారు. ఇకనుంచి ఒక్క టిప్పర్ కూడా మిక్సింగ్ ప్లాంట్ నుంచి ఇతర ప్రాంతాలకు తరలి వెళ్తే సహించేది లేదంటూ గ్రామ సర్పంచ్ ధర్మతేజ హెచ్చరించారు. ఐదేళ్లుగా బీర్కూర్ మంజీరా నదిలో ఆరు ఇసుక క్వారీ లు కొనసాగితేఇప్పటివరకు సినర్జీ డబ్బులు గ్రామపంచాయతీలో ఒక్క నయా పైసా కూడా జమ కాలేదు, ఈ డబ్బులు అన్ని ఎవరి ఖాతాలోకి వెళ్లాయి? అన్నది ప్రశ్నార్థకంగా మిగిలింది. ఎక్కడైనా మైనింగ్ శాఖ ద్వారా మొరం గాని, ఇసుక గాని తీసుకు వెళ్తుంటే కచ్చితంగా మైనింగ్ శాఖకు సినర్జీ డబ్బులు చెల్లించవలసి ఉంటుంది. ఈ డబ్బులు గ్రామ పంచాయతీకి 50 శాతం, మండల ప్రజా పరిషత్ కు 15 శాతం, జిల్లా పరిషత్ కు 15 శాతం, 20 శాతం ప్రభుత్వ ఖజానాకు వెళ్తాయి. కానీ ఇది ఎవరికి తెలియకుండా గుట్టు చప్పుడు కాకుండా బీర్కూర్ మంజీరా నదిలో ఇసుక మాఫియా ఇలా చెలరేగిపోతుంది. అధికారం మాది... మమ్మల్ని అడ్డుకునేది ఎవరు? అన్న ధీమాతో చెక్ డ్యాం కాంట్రాక్టర్ ఐదేళ్లుగా బీర్కూర్ మంజీరా నది నుంచి ఒకవైపు చెక్ డ్యామ్ నిర్మాణం పనులకు ఉచితంగా ఇసుక తీసుకుంటూ, మరొకవైపు వివిధ నియోజకవర్గంలో తాను కాంట్రాక్టు చేస్తున్న పనులకు ఇక్కడి నుంచే ఇసుక మిక్సింగ్ చేసుకొని తరలించకపోయి కోట్లు దండుకుంటున్నారు. ఇప్పటికైనా మిక్సింగ్ ప్లాంట్ నుంచి అక్రమంగా బయటకు ఇసుక కంకర సిమెంట్ మిక్సింగ్ వెళ్లకుండా అధికారులు అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# అక్రిడేషన్ ఉంటేనే జర్నలిస్టా?

- వాస్తవాలు - అపోహలు




మార్చ్ 2 జన సంరక్షణ

సమాజంలో జరిగే విషయాలను సేకరించి, విశ్లేషించి ప్రజల ముందుకు తీసుకువచ్చే ప్రతి వ్యక్తీ జర్నలిస్టే. జర్నలిజం అనేది ఒక బాధ్యతాయుతమైన వృత్తి. అయితే, "అక్రిడేషన్ కార్డు ఉంటేనే జర్నలిస్ట్ అవుతారు అనేది సమాజంలో ఉన్న ఒక పెద్ద అపోహ. దీని వెనుక ఉన్న అసలు వాస్తవాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం...ఈ విషయాన్ని సులభంగా అర్థం చేసుకోవడానికి ఒక ఉదాహరణ చూద్దాం. భారతదేశంలో పుట్టిన ప్రతి ఒక్కరూ భారతీయ పౌరులే. అయితే, ప్రభుత్వం దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారిని గుర్తించి వారికి మాత్రమే ' రేషన్ కార్డు ఇస్తుంది. దానికి కారణం వారికి కొన్ని రాయితీలు అందించడమే. అంతమాత్రాన, రేషన్ కార్డు లేని వారు దేశ పౌరులు కాకుండా పోరు కదా! జర్నలిజం కూడా సరిగ్గా అంతే. ప్రజల కోసం వార్తలు రాసే ప్రతి ఒక్కరూ జర్నలిస్టులే, కానీ ప్రభుత్వపరమైన నిర్దిష్ట అవసరాల కోసం కొందరికి మాత్రమే ప్రభుత్వం 'అక్రిడేషన్' మంజూరు చేస్తుంది.సంస్థల చట్టబద్ధత - ఎంసీఏ రిజిస్ట్రేషన్వార్తలు అందించే ప్రతి డిజిటల్ మీడియా, పత్రిక లేదా న్యూస్ ఏజెన్సీ చట్టబద్ధంగా పనిచేయాలి. దీనికోసం కేంద్ర ప్రభుత్వానికి చెందిన మినిస్ట్రీ ఆఫ్ కార్పొరేట్ అఫైర్స్ వద్ద ఆయా సంస్థలు రిజిస్ట్రేషన్ చేసుకుంటాయి. ఈ ఎంసీఏ రిజిస్ట్రేషన్ అనేది ఆ సంస్థ యొక్క మనుగడకు చట్టబద్ధతను కల్పిస్తుంది.

**మరి అక్రిడేషన్ కార్డు దేనికి?:**
మీ వార్తా సంస్థకు ఎంసీఏరిజిస్ట్రేషన్ ఉన్నప్పటికీ, అందులో పనిచేసే జర్నలిస్టులకు ప్రభుత్వం అధికారికంగా కల్పించే కొన్ని సౌకర్యాలు యాక్సెస్ కోసం ' అక్రిడేషన్' అవసరం అవుతుంది. దీని ప్రధాన ఉపయోగాలు ఇలా ఉంటాయి ప్రభుత్వ కార్యాలయాలు, సెక్రటేరియట్, అసెంబ్లీ , పార్లమెంట్ సమావేశాలకు అధికారిక ప్రవేశం.ప్రభుత్వ వర్గాల నుండి సమాచారం సేకరించడానికి, ముఖ్యమైన ప్రభుత్వ కార్యక్రమాలను కవర్ చేయడానికి అనుమతి.జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం అందించే ఆరోగ్య పథకాలు కొన్ని ప్రత్యేక సందర్భాలలో రైల్వే టిక్కెట్లలో బస్సు ప్రయాణాల్లో రాయితీలు. ఒక వార్తా సంస్థను చట్టబద్ధంగా నడపడానికి ఎంసీఏ రిజిస్ట్రేషన్ ఉపయోగపడుతుంది. ప్రభుత్వ కార్యక్రమాలకు అడ్డంకులు లేకుండా వెళ్లడానికి, సంక్షేమ పథకాలు అందుకోవడానికి అక్రిడేషన్ కార్డు ఉపయోగపడుతుంది. అంతేగానీ, సమాజాన్ని ప్రశ్నించే వార్తలు రాసే అర్హతను కేవలం ఒక కార్డు మాత్రమే నిర్ణయించలేదు. జనం పక్షాన నిలబడే ప్రతి వ్యక్తీ జర్నలిస్టే. అక్రిడేషన్ కార్డు ఉన్న వ్యక్తి జర్నలిస్టు అని చెప్పుకోవడం సరి అయినది కాదు.. అధికారులారా మీరు కూడా ఆలోచించండి జర్నలిజం అనేది ఒక సామాజిక బాధ్యత. అక్రిడేషన్ కార్డు అనేది పత్రికలో పనిచేసే వారికి బస్సు, రైలు ప్రయాణం లో రాయితీ, అంతేగాని అక్రిడేషన్ కార్డు లేని వారు విలేకరులు కాదు అని కొందరు చెప్పుకొని తిరగడం ఇది ఇంతకు క్షమించరాని విషయం...

# నిర్బంధాల మధ్య రాహుల్ గాంధీ పర్యటన...

హైదరాబాద్ సిటిబ్యూరో మార్చ్ 2(జనసంఘర్షణ )



రాహుల్ గాంధీ తెలంగాణ పర్యటన సందర్భంగా చిక్కడపల్లి లైబ్రరీ విద్యార్థులను ముందస్తు అరెస్ట్ చేసిన పోలీసులు. రాహుల్ గాంధీ అధికారంలోకి రాకముందు మా లైబ్రరీ దగ్గరికి వచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తాం, యూపీఎస్సీ తరహా జాబ్ క్యాలెండర్ రూపొందిస్తాం అని మాతో కలిసి టీ తాగుతూ హామీ ఇచ్చాడు. రెండేళ్లు దాటి పోతావున్న ఇప్పటికీ ఒక జనరల్ నోటిఫికేషన్ లేదు. 15 మంది నిరుద్యోగులు చనిపోయారు. జాబ్ క్యాలెండర్ లేదు. నిరుద్యోగ భృతి లేదు. మా నిరుద్యోగులకు ఇచ్చిన ఒక్క హామీ నెరవేర్చకుండా తెలంగాణకు ఎట్లా వస్తావు అని నిరుద్యోగులు ప్రశ్నిస్తారని భయపడి, చిక్కడపల్లి లైబ్రరీ విద్యార్థులైన సురేష్ నాయక్, కయ్య వెంకటేష్, లక్ష్మణ్ కుమార్ లను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు.

# నిజామాబాద్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల నూతన కమిటీ ఏర్పాటు

మార్చ్ 2 జనసంఘర్షణ



నిజామాబాద్ జిల్లా తెలంగాణ ఉద్యమకారుల నూతన కమిటీ సోమవారం ఏర్పాటయింది. చైర్మన్ పుప్పల రవి, అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, కన్వీనర్ పులి జైపాల్, ప్రధాన కార్యదర్శి సల్లా ప్రవీణ్, అధికార ప్రతినిధి గొల్లపల్లి రాజుగౌడ్, కోకన్వీనర్స్ సాయిరాం యాదవ్, అబ్బీ ప్రగతి కుమార్, బరికుశీట శ్రీనివాస్ లు ఎన్నికయ్యారు జిల్లా ఉపాధ్యక్షులుగా భవానిపేట్ శ్రీనివాస్, నావాతే ప్రతాప్, లాల్ సింగ్, అనుపాల్ కిరణ్, యూసఫ్, రంజిత్ కుమార్, కార్యదర్శులు, సౌందర్య, సిద్ధలక్ష్మి, మైత్రి రాజశేఖర్, జ్వాల రాణి, సలహాదారులు జమాల్పూర్ గణేష్, నరసింహ చారి, దాదన్న విట్టల్ రావు, గైని గంగారం, ఆశ నారాయణ, రాజారెడ్డి లు ఎన్నికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వాలు తెలంగాణ ఉద్యమం సమయంలో ఉద్యమకారులు పోరాడిన పోరాటం మర్చిపోతున్నారని, నూతనంగా ఎన్నికైన తెలంగాణ ఉద్యమకారుల జిల్లా నూతన కమిటీ వెల్లడించింది.

# బిసి లకు అట్రాసిటీ చట్టాన్ని ఏర్పాటు చేయాలి....

హైదరాబాద్ సిటీ బ్యూరో మార్చ్ 2(జనసంఘర్షణ )



బీసీ లకు అట్రాసిటీ చట్టం ఏర్పాటు చేయాలనే డిమాండ్ చేస్తూ ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా సోమవారం నిర్వహించారు. ఈ ధర్నాలో బీసీ ఉద్యమ నాయకులు డాక్టర్ చిక్కా దేవదాసు , తీన్మార్ మల్లన్న బిసి నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా హోలీ సాంస్కృతిక కార్యక్రమాలు

చందూర్, మార్చ్ 2 (జన సంఘర్షణ )



నిజామాబాద్ జిల్లా చందూరు మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంగణంలో కారేగం తండా బంజారా సోదరులు ఘనంగా హోలీ కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు, సాంస్కృతిక కార్యక్రమాలతో ప్రజలను అలరింప చేశారు. కోలాటలు, నృత్యాలతో గిరిజన సంస్కృతిగా సాంప్రదాయ పాటలతో పలువురిని కనువింపు చేశారు. సుమారు 500 సంవత్సరాల క్రితం నుంచి ఘనంగా హోలీ సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, సేవాలాల్ మహారాజ్ స్ఫూర్తితో, ఆయన ఆశీర్వాదంతో ఈ కార్యక్రమం నిర్వహించబోతామని గిరిజన సోదరులు తెలిపారు. బంజారా సోదరులంతా ఐక్యమత్యంతో ఉండడం కోసం, సేవాలాల్ మహారాజు పై భక్తితో ఈ కార్యక్రమాలు ఘనంగా నిర్వహిస్తామని బంజర సోదరులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ కర్ణం సాయి రెడ్డి అదేవిధంగా ప్రముఖ నాయకులు సంఘం శ్రీనివాస్ గౌడ్ తో పాటు నాయకులు అంబర్ సింగ్, నాయకులు, లీడర్లు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే

కుంటాల, మార్చ్2 (జన సంఘర్షణ)



కుంటాల మండలంలోని కల్లూరు, అందాకుర్, పెంచికల్ పాడ్, విట్టాపూర్, వెంకూర్ గ్రామాల్లో మహిళా సమాఖ్య సంఘ భవనాల నిర్మాణానికి పవార్ రామారావు పటేల్ భూమి పూజ నిర్వహించి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళల సాధికారతకు మహిళా సమాఖ్య సంఘ భవనాలు కీలకంగా నిలుస్తాయని తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, మహిళల ఆర్థిక-సామాజిక పురోగతికి అవసరమైన మౌలిక వసతులను అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
మంగళవారం
03 మార్చి 2026

# మద్యం మత్తులో తల్లిని చంపడం వెనుక కారణం?

- గ్రామాల్లో ఉన్న వైన్స్ కార్యాలయం
- గ్రామాలలో ఉన్న బెల్ట్ షాపులు ప్రధాన కారణం కావా?

కోటగిరి . మార్చ్ 2 ( జన సంఘర్షణ )

గ్రామానికి ఊరి బయట ఉండాల్సిన వైన్స్ కార్యాలయం ప్రధాన రహదారి పక్కనే ఉండడం గతంలో అనేక ఆందోళనలు జరిగిన ఫిర్యాదులు ఇచ్చిన చర్యలు ఎందుకు తీసుకోలే దాని వెనుక అంతర్యం ఏమిటి. కోటగిరి లో ఉన్న కొంతమంది స్వార్ధ రాజకీయ నాయకుల మాయమాటల్లో ఆ పెద్ద సారు ఉన్నారా. ఓ బడా సారు మద్దతుగా ఉండడమే. చర్యలు తీసుకోవడంలో విఫలమా ఏది కారణం. మద్యానికి బానిస అయ్యిండు మద్యానికి డబ్బులు లేవు డబ్బుల కోసం పెన్షన్ డబ్బులు వచ్చే ఓ వృద్ధురాలు నవ మాసాలు కనీ పెంచిన మాతృమూర్తినే చంపడానికి వెనుకంజ వేయలేదు కసాయి కొడుకు. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో మద్యానికి బానిసై డబ్బులు లేకపోవడంతో తల్లిని హతమార్చి అతి క్రూరంగా మూడుసార్లు కిరోసిన్ పోసి తగలబెట్టిన వైనం నెలకొనడం యావత్ రాష్టానికి దేశానికే కలం వింపుగా తెచ్చింది. దీనికి ప్రధాన కారణం మండల కేంద్రంలో ప్రధాన రహదారి పక్కనే ఉన్న వైన్స్ కార్యాలయం



అదేవిధంగా ఊరికి దగ్గర ఉన్న వైన్స్ కార్యాలయం అదేవిధంగా గ్రామాల్లో విచ్చలవిడిగా పుట్టగొడుగుల వెలసిన బెల్ట్ షాపులే ప్రధాన కారణమా అని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఏది నిజం అనేది ఈ ఉదాహరణ బట్టి తెలుస్తుందని ప్రజలు అంటున్నారు. వైన్స్ నిర్వక్కులే ప్రత్యక్షంగా పరోక్షంగా బెల్టు షాపులకు నిర్వహణలో కారకులై ఈ విధంగా సంఘటనలు జరగడంలో కారకుల అవుతున్నారని అనుమానాలు, విమర్శలు మాత్రం సర్వత్వం వినిపిస్తున్నాయి. ఊరికి దగ్గరగా ప్రధాన రహదారి పక్కనే జనవాసల మధ్య వైన్స్ కార్యాలయం అనేక సంవత్సరాల నుంచి ఉందని దీని తొలగించాలని దీనివల్ల మహిళలు విద్యార్థులు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గ్రామ ప్రజలు ఆందోళన చేసిన వైనం నెలకొన్నప్పటికీ ఎక్సైజ్ శాఖ మామూలు తీసుకుంటూ అటువైపు కన్నెత్తి చూడడం లేదని ప్రజలు ఆరోపణలు చేస్తున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలోని ఓ బడా సారు కింది స్థాయిలో ఉన్న కొందరి స్వార్థం కోసం అధికారులపై ఒత్తిడి తెచ్చి వైన్స్ కార్యాలయం తీయనియకుండా అడ్డుపడుతున్నారని ఈ విషయంపై బడా సారుపై గుస్తాగా ప్రజలు కాలనీ ప్రజలు ఉన్నట్టు తెలుస్తుంది. ప్రజలకు ఆటంకం కలిగించే వైన్స్ కార్యాలయం విషయంలో ఓ బడా సారు ఇన్వాల్వ్మెంట్ కావడం సిగ్గుచేటని గ్రామస్తులు అసహనం వ్యక్తం చేస్తున్నట్టు ప్రచారం జరుగుతుంది. భవిష్యత్తులో ఇలాంటి సంఘటన జరగడానికి కారణం ఇక్కడున్న కొంతమంది స్వార్థ రాజకీయ నాయకులు అయితే బడా సారు కూడా ప్రధాన కారకులు కారా ఒకవేళ భవిష్యత్తులో అనుకొని పెద్ద సంఘటనలు జరిగితే చూయిస్తాం అనే కోణంలో ప్రజలు ఎదురుచూస్తున్నట్టు ప్రచారం భారీగా జరుగుతుంది.

# గల్ఫ్ దేశాలల్లో ఉద్రిక్త పరిస్థితులు

- నిజామాబాద్‌లో 24ఐ7 కంట్రోల్ రూమ్ ఏర్పాటు
- సీపీ పి. సాయి చైతన్య వెల్లడి

నిజామాబాద్. మార్చ్ 2 ( జన సంఘర్షణ )

గల్ఫ్ దేశాలలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో అక్కడ చిక్కుకున్న భారతీయుల, ముఖ్యంగా నిజామాబాద్ జిల్లాకు చెందిన పౌరుల సహాయార్థం ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య తెలిపారు. గల్ఫ్ ప్రాంతాల్లో ఉన్న తమ కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకోవాలనుకునే వారికి సకాలంలో సమాచారం అందించేందుకు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 24 గంటలు పనిచేసే ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం కూడా ప్రజల సౌకర్యార్థం న్యూఢిల్లీలో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ప్రారంభించింది. అక్కడి అధికారులతో సమన్వయం చేస్తూ నిజామాబాద్‌లో ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. గల్ఫ్ దేశాల్లో ఉన్న వారి భద్రత, స్థితిగతులపై సమాచారం పొందడానికి కుటుంబ సభ్యులు వెంటనే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని సూచించారు.

సంప్రదించవలసిన నంబర్లు: నిజామాబాద్ పోలీస్ కంట్రోల్ రూమ్: 8712659700, సర్కిల్ ఇన్స్పెక్టర్: 8712659821. ప్రజలు అపోహలు నమ్మకుండా అధికారిక సమాచారం కోసం మాత్రమే ఈ నంబర్లను సంప్రదించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.




## విధులకు అతీతంగా పనిచేసినందుకు నగదు పురస్కారం

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 2 జన సంఘర్షణ :

ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇంటిలిజెన్స్ విభాగంలో అత్యుత్తమ ప్రదర్శన కలిగి విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి, అసాధారణ ప్రతిభ కనబరిచిన జూలూరుపాడు మండల ఇంటిలిజెన్సీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న ముల్లపాటి మురళి ని ఉమ్మడి ఖమ్మం జిల్లా అడిషనల్ ఎస్పీ రామోజీ రమేష్ అభినందిస్తూ నగదును బహుమతిగా అందించారు. ఈ సందర్భంగా రామోజీ రమేష్ మాట్లాడుతూ పోలీసు వృత్తి కేవలం విధినిర్వహణ మాత్రమే కాదని, అదొక సామాజిక బాధ్యతగా గుర్తు చేస్తూ పోలీసులు సమాజం పట్ల జవాబుదారీతనంతో వ్యవహరించాలని సూచించారు. విధి నిర్వహణలో అత్యుత్తమ ప్రదర్శన కనభరిచిన మురళిని సహఉద్యోగులు, ఉన్నతాధికారులు అభినందించారు.



## ప్రజావాణికి 164 దరఖాస్తులు..



- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ గరిమ అగ్రవాల్.

రాజన్న సిరిసిల్ల జిల్లా / మార్చ్ 2 ( జనసంఘర్షణ )

2 సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, 164 దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటిని పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ శాఖకు 61, గృహ నిర్మాణ శాఖకు 25, జిల్లా పంచాయతీ కార్యాలయం, డీఆర్డీఓకు 13 చొప్పున, సంక్షేమ శాఖకు 09, ఉపాధి కల్పన శాఖకు 08, ఎండీ సెస్ 05, మున్సిపల్ కమిషనర్ సిరిసిల్ల, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ 04 చొప్పున, ఎక్సైజు శాఖ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కు మూడు చొప్పున, పౌర సరఫరాల శాఖ, విద్యా శాఖ, వైద్య శాఖ, ఆర్ అండ్ బీకి రెండు చొప్పున, జిల్లా వ్యవసాయ శాఖ, రవాణా శాఖ, డీఎం ఆర్టీసీ సిరిసిల్ల, శ్రీ రాజరాజేశ్వర ఆలయ ఈఓ, నీటి పారుదల శాఖ, మిషన్ భగీరథ, మున్సిపల్ కమిషనర్ వేములవాడ, ఎస్పీ కార్యాలయానికి 01 చొప్పున వచ్చాయి. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆయా శాఖల తదితరులు పాల్గొన్నారు.

## పశ్చిమ ఆసియా దేశాల్లో నెలకొన్న పరిస్థితులపై అప్రమత్తం..

- తెలంగాణ భవన్‌లో 24/7 కంట్రోల్ రూమ్

హైదరాబాద్ సిటి / మార్చ్ 2 (జనసంఘర్షణ )




మధ్యప్రాచ్య (పశ్చిమ ఆసియా) దేశాల్లో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు న్యూ ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో 24 గంటల కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసింది.భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ, సంబంధిత భారత రాయబార కార్యాలయాలతో తెలంగాణ భవన్ అధికారులు నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తున్నారు. ఆ ప్రాంతాల్లో ఉన్న తెలంగాణ పౌరులు లేదా వారి కుటుంబ సభ్యులు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవచ్చు. సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు:

వందన బరువా-9871999044, సీహెచ్. చక్రవర్తి -- 9958322143
జావేద్ హుస్సేన్-9910014749, రక్షిత్ నాయక్ -- 9643723157.

తెలంగాణ ప్రభుత్వం పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన సహాయం అందించేందుకు సిద్ధంగా ఉంది.

## రాహుల్ గాంధీ తెలంగాణాకు రాక..

- నిరుద్యోగ జె ఏ సి నేతల ముందస్తు అరెస్ట్

హైదరాబాద్ సిటిబ్యూరో /మార్చ్ 2(జనసంఘర్షణ )




నేడు కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ తెలంగాణ కు రానుండడంతో నిరుద్యోగదేశ నేతలను ముందస్తుగా తరలించడం జరిగింది. తెలంగాణాలో నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చే తెలంగాణ గడ్డపై అడుగు పెట్టాలని ఈ సందర్భంగా జేఏసీ నేతలు పేర్కొన్నారు. అర్ధరాత్రి జేఏసీ నేతల రూంలోకి వచ్చి పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం దారుణమని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఎన్నికల సమయంలో చిక్కడపల్లి లైబ్రరీకి వచ్చిన రాహుల్ గాంధీ ఈ ప్రభుత్వం వచ్చాక ఎందుకు రాలేకపోతున్నారు అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేసి తెలంగాణ గడ్డపై రాహుల్ గాంధీ రావాలని పేర్కొన్నారు. గో బ్యాక్ రాహుల్ గాంధీ అని నినదించారు. ముందస్తు అరెస్ట్ అయినా వారిలో నిరుద్యోగ జెఏసి నేతలు శంకర్ నాయక్, రవి రాథోడ్, రవి కుమార్, లక్ష్మికాంత్ ,తారాచంద్ తదితరులను అదుపులోకి తీసుకున్నారు.

## సత్యానంద సరస్వతి స్వామీజీ శతజయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే లోకేశ్వరం

మార్చ్2 (జన సంఘర్షణ)



లోకేశ్వరం మండలంలోని బ్రహ్మేశ్వర్ గ్రామంలో నిర్వహించిన సత్యానంద సరస్వతి స్వామీజీ 100వ శతజయంతి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పవార్ రామారావు పటేల్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామీజీకి ఘన నివాళులు అర్పించారు. అనంతరం బాగాపూర్ గ్రామంలో నిర్వహించిన శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని భక్తులతో కలిసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల సంక్షేమం, ప్రాంతీయ అభివృద్ధి, ఆధ్యాత్మిక విలువల పరిరక్షణే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చెక్ డ్యామ్ నిర్మాణం కొరకు వాగులో ఉన్న దుబ్బ ఇసుకను డంప్ చేసిన కాంట్రాక్టర్లు

- గతంలో నారాయణపురం ఎస్సీ కాలనీలో పోసిన సీసీ రోడ్ల నిర్మాణం లాగే ఉంటుంది అంటున్న ఆదివాసీలు

అశ్వారావుపేట / మార్చి..2 ( జన సంఘర్షణ )





అశ్వారావుపేట మండలం ఖమ్మంపాడులో ఆదివారం అదనుగా చేసుకుని వాగులోని ఇసుకను చెక్ డ్యామ్ నిర్మాణం కొరకు దుబ్బ ఇసుకను అక్రమ మార్గంలో ఇసుక రవాణా కు పూనుకున్నారు. ఈ అక్రమ మార్గంలో ఇసుక రవాణా విషయం తెలుసుకొని ఆయా గ్రామాల ప్రజలు వెంటనే మీడియా కు సమాచారం అందించారు.మీడియా ప్రతినిధులు అక్కడకు చేరుకొని ఫోటోలు, వీడియోలు తీసి, పోలీస్ వారికి సమాచారం ఇచ్చిన వెంటనే పోలీస్ వాసు స్పందించి వచ్చేలోపే వారు ట్రాక్టర్లతో జేసీబి తో పరారైనరూ, ఈ దుబ్బ ఇసుకను అక్రమ మార్గంలో ఎక్కడకు తరలిస్తున్నారని చూడగా చెక్ డ్యామ్ దగ్గరగా దాదాపు 45 టన్నుల ఇసుకను డంప్ చేసి ఉన్నారు. ఇదే దుబ్బ ఇసుకను ఉపయోగించి చెక్ డ్యామ్ నిర్మాణం చేపడితే నాణ్యత లోపిస్తుందని, గతంలో కూడా ఖమ్మంపాడు వాగులో దుబ్బ ఇసుకను ఉపయోగించి సిసి రోడ్ల నిర్మాణం చేస్తే 20 రోజుల్లోనే అవి ఎక్కడికక్కడ పగిలిపోయాయని నారాయణపురం లోని ఎస్సీ కాలనీ వారు తెలిపారు. అదేవిధంగా ఫ్రీగా ఇసుక దొరుకుతుందని నాణ్యతతో పని లేకుండా నిర్మాణం చేసి రాజకీయ అండదండలతో బిల్లులు చేయించుకునే ప్రయత్నం చేస్తున్నారని పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఖమ్మంపాడు మేకల బండ నారాయణపురం, గ్రామ ప్రజలు అధికారుల సమక్షంలోనే చెక్ డ్యామ్ నిర్మాణం జరగాలని ప్రతి రోజు సంబంధిత అధికారుల సమక్షంలోనే చెక్ డ్యామ్ నిర్మాణ పనులు జరగాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## అర్హులకు వేరువేరుగా పింఛన్ల పంపిణీ

- రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మునుస్వామి

రామకుప్పం మార్చి..2 ( జన సంఘర్షణ)




అర్హులందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివిధ రకాల పింఛన్లు మంజూరు చేసినట్లు రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మునుస్వామి మాజీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆంజనేయ రెడ్డిలు పేర్కొన్నారు. సోమవారం మండలంలో ఎన్టీఆర్ సామాజిక భరోసా పింఛన్లు నూతనంగా మంజూరైన వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల మేరకు వివిధ రకాల పింఛన్లను మంజూరు చేసి పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. గతంలో పలువురు పొందని వితంతు వికలాంగ పింఛన్లు మంజూరు కాగా వాటిని పంపిణీ చేయడంతో లబ్ధిదారుల కళ్ళల్లో ఆనందం వ్యక్తమైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి పత్రా నారాయణ చారి, టెస్టర్ ఇంచార్జ్ నాగభూషణ్, మాజీ సర్పంచులు ఆర్కే రామమూర్తి, జయశంకర్, ఎంపిపి సులోచన, గుర్రప్ప, కుప్పం ఏరియా ఆసుపత్రి కమిటీ డైరెక్టర్ ఆర్ విజయ్ కుమార్ రెడ్డి, నేతలు మహేష్ మహేంద్ర నాయుడు, లోకేష్ క యూనిట్ ఇంచార్జ్ చంద్రశేఖర్ రెడ్డి, రామలింగం, బీరప్ప, సుభాష్, శంకర్, చలం, గుణశేఖర్, వాటర్ సత్తి, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక



# శివాలయంలో అన్నదాన కార్యక్రమం

కార్వేటినగరం(జన సంఘర్షణ):





కార్వేటి నగరం మేజర్ పంచాయతీ నగరం చెరువు సుద్దగుంట సమీపలో వెలసిన శిష్ట సౌందర్యవల్లి సమేత సదాశివేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ వద్ద కార్వేటినగరం బీసీ కాలనీ చెందిన అరుణ్ గోళం పద్మ వేలు రెడ్డి, తిలగ బాలాజీ బాలకృష్ణ వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు మోహన్ రాజు, కార్యదర్శి రాజేందర్రెడ్డి, సుబ్బరాయల్ యాదవ్, నాగయ్య యాదవ్, ప్రసాద్ రాజు, సుబ్రహ్మణ్యం రాజు, మహిళలు పాల్గొన్నారు.

# మదర్స్ ఛాయిస్ స్కూల్ లో ఘనంగా సైన్స్ ఎగ్జిబిషన్ కార్యక్రమం

వరంగల్, మార్చి 02 (జన సంఘర్షణ):



ఖిలా వరంగల్ రహమత్ నగర్ మదర్స్ ఛాయిస్ పాఠశాలలో వార్షిక సైన్స్ ఎగ్జిబిషన్ ఘనంగా జరిగింది. సైన్స్ అండ్ టెక్నాలజీ పురోగతి మాత్రమే ఆధునిక ప్రపంచంలో మన మాతృభూమిని విముక్తి చేయగలదని, అందువల్ల యువ మనస్సులో శాస్త్రీయ మరియు సృజనత్మక దృక్పథాన్ని నిర్మించడానికి మేము కృషి చేస్తున్నామని పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. పిల్లలు సంతోషంగా వారి ప్రదర్శనలను ముందుంచడం జరిగింది. ఈ నేపథ్యంలో ప్రదర్శనలను తిలకించిన వారి తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేవు. అలాగే పిల్లలు, అధ్యాపకులు, పేరెంట్స్ సహకారంతో కార్యక్రమం విజయవంతం అయిందని ప్రిన్సిపాల్ ఇంతియాజ్ సంతోషం వ్యక్తం చేశారు.

## జయనగర్‌లో టెన్నిస్ పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం


హైదరాబాద్, మార్చి 02 (జన సంఘర్షణ):




జయనగర్‌లోని ఆదిత్య సుభాష్ టెన్నిస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన టెన్నిస్ పోటీలలో విజేతలకు ఈరోజు బహుమతుల ప్రదాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కంటెస్టెడ్ కార్పొరేటర్ నర్సింగ్ యాదవ్ హాజరై, విజేతలకు బహుమతులు అందజేశారు. విజేతలను అభినందిస్తూ క్రీడల ద్వారా యువత శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది. ఈ కార్యక్రమంలో నరసింహ చారి, ఆంజనేయులు యాదవ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఐటి విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా మహేష్ రెడ్డి


కార్వేటినగరం(జన సంఘర్షణ):



ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం ఐ టి వి బాగా రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కార్వేటినగరం మండలం ముక్కర వానిపల్లి చెందిన టిడిపి నాయకుడు మహేష్ రెడ్డి నియమించినట్లు ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ రెడ్డి తెలిపారు. సమాజంపై చూస్తున్న అంకితభావం రెడ్డి సామాజిక వర్గ అభివృద్ధికి చేస్తున్న కృషి ఫలితంగా ఐటి విభాగం రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమించారు. తాను సంఘ నిర్ణయాన్ని కట్టుబడి సిద్ధాంతాలు అనుగుణంగా పనిచేస్తామని ఆయనకు పది రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రభుత్వాలు మారిన రోజురోజుకు ఈదుల గుంటలో కబ్జాలు

తొట్టంబేడు మార్చ్ 2 (జన సంఘర్షణ):



మండలంలో తొట్టంబేడు పంచాయతీలో ప్రభుత్వాలు మారిన కబ్జా ఆగడాలు గత ప్రభుత్వం కన్నా ఇప్పుడు రోజురోజుకు కబ్జా ఆగడాలు ఎక్కువయ్యాయని, పట్టపగలే ఈదుల గుంట చెరువులో జెసిబీ తో ఆక్రమణ, గత కొద్ది రోజులుగా ప్లాట్లు వేస్తున్న వైనం. ఇప్పటికే ఎల్ఐసి కాలనీ, బంగారమ్మ కాలనీ, చిలకవారి కండ్రిగ సంబంధించి చెరువులు, కాలువలు కబ్జా లు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణలు అడ్డుకోవాలని, కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# కబీర్ నగర్, అవంతి నగర్ తోటలో పర్యటించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

హైదరాబాద్, మార్చి 02,(జన సంఘర్షణ):

ఉమ్మడి మూసాపేట్ డివిజన్ కబీర్ నగర్, అవంతి నగర్ తోటలో కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మూసాపేట్ మాజీ కార్పోరేటర్ తూము శ్రావణ్ కుమార్ తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కబీర్ నగర్ నాళా స్లాబ్, అవంతి నగర్ తోట కమ్యూనిటీ హాల్ లో నిర్మితమైన షెడ్ ను పరిశీలించారు. కబీర్ నగర్ వాసుల చిరకాల స్వప్నం, నాళా స్లాబ్ పూర్తవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేసి ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా అవంతి నగర్ తోట కమ్యూనిటీ హాల్ నందు పలు కార్యక్రమాలకు ఉపయోగ పడే విధంగా షెడ్ నిర్మాణం చేపట్టి నందుకు కాలనీ వాసులు హర్షాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సి.హెచ్ సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తిరుపతి, నాగుల సత్యం,కబీర్ నగర్ అధ్యక్షులు జోసెఫ్, మోహన్ రెడ్డి, వెంకటేశ్వర్లు, బోడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు..



## కలంకారి మల్లం సునందకు రాష్ట్రపతిచే పురస్కారం..

తొట్టంబేడు మార్చ్ 2 (జన సంఘర్షణ):




శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలం చిన్నసింగమాల గ్రామం నందు కలంకారి వృత్తినే నమ్ముకుని జీవనాధారం సాగిస్తున్న గ్రామీణ మహిళ మల్లంసునందకు ఫిబ్రవరి 24వ తేదీన రాష్ట్రపతి ద్రౌపతిముర్ము చే గౌరవ పురస్కారం అందుకున్నారు.కలంకారి కలంకారిణి మల్లం సునంద మాట్లాడుతూ..తాను ఈ కలంకారి కళను 2006నుంచి నేర్చుకుంటూ జీవనాధారం సాగిస్తున్నానని, తన భర్త కరోనా సమయం నందు కరుణవ్యాధితో మృతి చెందాడని, అప్పటినుంచి తాను ఈ కలంకారికలతో వచ్చే ఆదాయంతో జీవనాధారం సాగిస్తూ తన సంతానాన్ని ఉన్నత చదువులు చదివిస్తూ, గ్రామీణ మహిళలగా ఇంటిలోనే జీవనాధారం సాగిస్తూ జీవనం గడుపుతున్నానని, తాను నేర్చుకున్న ఈ కలంకారి కలను తనతో పాటు మరింత అభివృద్ధి పరచాలని దిశగా, తమ గ్రామంలో 27 మంది మహిళలకు ఈ కలంకారి కలను నేర్పిస్తూ వారికి జీవనాధారం కల్పిస్తున్నానని తెలియజేశారు. ఈనెల 16వ తేదీన రాష్ట్రపతి భవనం నందు గత 100 సంవత్సరాలుగా ఉన్న చిత్రపటాలను తొలగించి శ్రీకాళహస్తికే ప్రతిష్టాత్మకైన కలంకారి కల డిజైన్లను ఏర్పాటు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం కార్యాచరణ చేపట్టారని, అందులో భాగంగా కాళహస్తి నుంచి 21 మంది కళాకారులు ఆహ్వానించగా, కలంకారి కళాకారులు రాష్ట్రపతి భవన్ చేరుకొని అక్కడ తాము తయారుచేసిన కలంకారి డిజైన్లను రాష్ట్రపతి భవనం నందు చిత్రపటాలుగా ఏర్పాటు చేశారని.. తాము చేసిన కలంకారి కళా యొక్క గొప్పతనాన్ని అభినందిస్తూ, రాష్ట్రపతి ద్రౌపతిముర్ము తమను సత్కరించి షీల్డ్ అందజేశారని. అంతటి పెద్దవారిని కలుసుకోవడం ఓ గ్రామీణ మహిళగాతాను ఆనందపడుతున్నానని తెలియజేశారు. మహిళా సాధికారతే లక్ష్యంగా గ్రామీణ మహిళలను అభివృద్ధిపరిచే దిశగా ఇలా ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి , తామతోటి మహిళ రాష్ట్రపతి ద్రౌపత్తి ముర్ముకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# కెఎస్ఎస్ సర్వేలో అర్హులందరికీ చేరుతున్న సంక్షేమ ఫలాలు

- మాజీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆంజనేయ రెడ్డి

రామకుప్పం మార్చి 2 (జన సంఘర్షణ):



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వినూత్నంగా అమలు చేసిన కే ఎస్ ఎస్ సర్వేల ద్వారా ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు సమకూర్తాయని మండల మాజీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆంజనేయ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రామ్ కుప్పం పంచాయతీ 69 బూత్ నెంబర్లు ఇంటింటా తిరిగి కె ఎస్ ఎస్ సర్వేను నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అందుతున్నాయా అంటూ ఆరా తీశారు అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు అందకపోవడంతో కె ఎస్ ఎస్ సర్వే ద్వారా ఆ కుటుంబానికి లబ్ధి చేకూతున్నట్లు చెప్పారు. మండలంలో ఈ కార్యక్రమాన్ని ఇంటింటా తిరిగి వేగవంతం చేస్తున్నట్లు చెప్పారు. సకాలంలో కె ఎస్ ఎస్ సర్వేను పూర్తి చేసి పార్టీ అధిష్టానం మేరకు కుప్పం పార్టీ కార్యాలయంలో సమకూర్చుతున్నట్లు చెప్పారు .ఈ కార్యక్రమం ద్వారా ప్రతి కుటుంబంలో నెలకొన్న సమస్యకు పరిష్కారం లభిస్తుందంటూ తెలిపారు. ఈ కార్యక్రమంలో కుప్పం ఏరియా కమిటీ డైరెక్టర్ ఆర్ విజయ్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ అల్లి శీన తదితరులు పాల్గొన్నారు.

# జన్మభూమి సేవలో ప్రేమ్ సాగర్ రెడ్డి

- అభివృద్ధితో పాటు సేవా కార్యక్రమాల్లోనూ ఆదర్శప్రాయులు
- చెన్నై శంకరనేత్రాలయ వారితో కలిసి నిర్వహిస్తున్న కంటి శస్త్రచికిత్స శిబిరాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి
- వెంకటాచలం మండలం నిడిగుంటపాళెంలో ననమాల ప్రేమ్ సాగర్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన కంటి శస్త్ర చికిత్స శిబిరాన్ని ప్రారంభించిన సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి





మనుబోలు. 2.3.2026(జన సంఘర్షణ):

ప్రేమ సాగర్ రెడ్డి ట్రస్ట్ శంకర నేత్రాలయం ఆధ్వర్యంలో సోమవారం కంటి శాస్త్ర చికిత్స శిబిరాన్ని సర్వేపల్లి ఎమ్మెల్యే మాజీ మంత్రి ప్రారంభించి మాట్లాడారు. మొదట ననమాల సుందరరామిరెడ్డి విగ్రహానికి నివాళి. శంకర నేత్రాలయం వారితో కలిసి ప్రేమసాగర్ రెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో చేపట్టిన కంటి శస్త్రచికిత్స శిబిరం పది రోజుల పాటు కొనసాగుతుందని చెప్పారు. సొంతూరిపై ప్రేమతో ప్రేమసాగర్ రెడ్డి ఎన్నో అభివృద్ధి, సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని ఆయనను అభినందించారు. చదువుకునే చిన్నబిడ్డలకు వసతులు కల్పించడంపై ప్రత్యేక దృష్టి పెట్టడం శుభపరిణామం. తండ్రి సుందరరామిరెడ్డి పేరుతో హైస్కూలు నిర్వహిస్తున్నారు. ఈ స్కూలు ప్రాంగంలో అభివృద్ధి కార్యక్రమాలకు రెండేళ్లలో రూ.4.50 కోట్లు ఖర్చు పెట్టారు . సుమారు రూ.5 కోట్ల నిదులతో గ్రామంలో సిమెంట్ రోడ్లు నిర్మించడంతో పాటు మినరల్ వాటర్ ప్లాంటు అందుబాటులోకి తెచ్చారు
స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ కు ఉపయోగపడేలా 14 గదులతో సౌకర్యవంతమైన భవనాన్ని నిర్మించారు. దీనదయాల్ ఉపాధ్యాయ గ్రామీణ కల్యాణ యోజన కింద పదో తరగతి పాసైన 60 మంది విద్యార్థినులకు ఆర్నెళ్ల పాటు స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ఇవ్వనున్నారు. ఇదే పథకం కింద బిల్డింగ్ ను అప్రూవల్ చేయాలని మంత్రి నారా లోకేష్ బాబు, కార్పొరేషన్ ఛైర్మన్ దీపక్ రెడ్డిని ఇప్పటికే కోరాను..సానుకూలంగా స్పందించారు. వీలైనంత త్వరలోనే స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ అందుబాటులోకి రానుంది. ప్రేమ్ సాగర్ రెడ్డి ఆధ్వర్యంలో ఇక్కడ కార్యక్రమాలు నిర్వహిస్తున్న రవీంద్రరెడ్డి, శ్రీహరిరెడ్డికి ధన్యవాదములు. ఈ ప్రాంత ప్రజలందరి తరఫున ప్రేమ్ సాగర్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. దేశవిదేశాల్లో స్థిరపడిన ఎన్.ఆర్.ఐలు ప్రేమ్ సాగర్ రెడ్డిని ఆదర్శంగా తీసుకుని సొంతూర్ల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సోమిరెడ్డి పిలుపునిచ్చారు.

# ఘనంగా బాలమేళా విజేతలకు బహుమతుల ప్రదానం

భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 02 ( జన సంఘర్షణ)

ఇల్లందు మండలం సుభాష్ నగర్ కాంప్లెక్స్ పరిధిలోని విద్యార్థినీ విద్యార్థులకు నిర్వహించిన బాలమేళా కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించగా విద్యార్థులు తమ ప్రతిభను చాటారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రధానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఇల్లందు మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) ఎం. ఉమాశంకర్, మాజీ ఎంఈఓ పిల్లి శ్రీనివాస్ విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు ఇలాంటి పోటీల్లో పాల్గొనడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. సుభాష్ నగర్ కాంప్లెక్స్ పరిధిలోని విద్యార్థుల ప్రతిభ




అభినందనీయం. పిల్లి శ్రీనివాస్ (మాజీ ఎంఈఓ ): బాలమేళా వంటి కార్యక్రమాలు గ్రామీణ స్థాయి విద్యార్థులకు ఒక మంచి వేదిక. గెలుపోటముల కంటే పట్టుదలతో ప్రయత్నించడం ముఖ్యం. కాంప్లెక్స్ పరిధిలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విజేతలకు బహుమతులు అందజేయడంతో విద్యార్థుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన ఉపాధ్యాయ బృందాన్ని ఎంఈఓ ఉమాశంకర్ ప్రత్యేకంగా అభినందించారు..

# వేడుకగా రాజంపేట టిడిపి పార్లమెంట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

- **కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర మంత్రులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి**
- **ప్రత్యేక ఆహ్వానితులుగా పుంగనూరు ఇంచార్జి చల్లా రామచంద్రారెడ్డి**
- **రాజంపేట పార్లమెంటరీ టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీగా పాలడుగు రెడ్డప్ప నాయుడు ప్రమాణస్వీకారం**

పుంగనూరు, మార్చి 2 జనసంఘర్షణ :

రాజంపేట పార్లమెంటరీ కార్యవర్గం ప్రమాణ స్వీకారం వేడుకగా తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మదనపల్లిలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలు గా రాష్ట్ర మంత్రులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, బీసీ జనార్దన్ రెడ్డి లు పాల్గొన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జి చల్లా రామచంద్రారెడ్డి లు పాల్గొన్నారు, ఈ సందర్భంగాపుంగనూరు మండలం వనమలదిన్నె గ్రామానికి చెందిన పాలడుగు రెడ్డప్ప నాయుడు పార్లమెంట్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా ప్రమాణస్వీకారం చేశారు. పాలడుగు రెడ్డప్ప నాయుడు మాట్లాడుతూ.. రాజంపేట పార్లమెంటు తెలుగుదేశం పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నాకు అవకాశం కల్పించి నాకు ఇంత గొప్ప అవకాశం ఇప్పించిన మా ప్రియతమ నాయకుడు పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ చల్లా రామచంద్ర రెడ్డి




ఆశీస్సులు నాకు ఉన్నంతవరకు జీవితాంతం ఆయనకు కృతజ్ఞతగా ఉంటానని తెలిపారు.. అదేవిధంగా పార్లమెంట్ పరిధిలో తెలుగుదేశం పార్టీనీ మరింత బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ గెలుపు కోసం అహర్నిశలు శ్రమిస్తానని తెలిపారు. తన ప్రమాణ స్వీకారానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన అన్నమయ్య జిల్లా ఇన్చార్జ్ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డికి, జిల్లా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి, ఇంచార్జ్ చల్లా రామచంద్ర రెడ్డికి, పుంగనూరు నియోజకవర్గం నుంచి తరలి వచ్చిన పార్టీ కుటుంబ సభ్యులకు మండల పార్టీ నాయకులకు కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో పుంగనూరు మార్కెట్ యార్డ్ కమిటీ ఛైర్మన్ సమీపతి యాదవ్, మండల, మున్సిపల్ నాయకులు మాధవరెడ్డి, సి.వి.రెడ్డి, పుంగనూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ మహిళా అధ్యక్షురాలు బాలినేని కవిత, తెలుగుదేశం పార్టీ మండల కార్యదర్శి మోహన్ రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బసినేపల్లి జయశ్రీ శంకర, పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా మహిళా దినోత్సవ వారోత్సవాలు ఘనంగా నిర్వహణ

- **మహిళల భద్రత, సాధికారతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు.**
- **విద్యార్థుల్లో లింగ సమానత్వం, చట్టాలపై చైతన్యం.**

తిరుపతి, మార్చి 2 జనసంఘర్షణ :

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., ఆదేశాల మేరకు, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ శ్రీలత నాయకత్వంలో తిరుపతి జిల్లా వ్యాప్తంగా మహిళా దినోత్సవ వారోత్సవాలు ఘనంగా నిర్వహించడం జరిగింది. జిల్లాలోని పలు విద్యాసంస్థలు, ముఖ్య కేంద్రాలలో ఈ కార్యక్రమాలు నిర్వహిస్తూ మహిళల సాధికారతపై విస్తృత అవగాహన కల్పించడం జరుగుతోంది. ఈ వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా స్కూల్లో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు, మత్తు పదార్థాల వినియోగం (డ్రగ్స్) వల్ల కలిగే అనర్థాలు, పోక్సో చట్టం (గూజుగూ ూజ్), రోడ్డు భద్రత నియమాలు, మహిళా భద్రత , కేంద్ర/రాష్ట్ర ప్రభుత్వాల నూతన చట్టాలపై సమగ్ర వివరణ ఇచ్చారు. విద్యార్థులకు ఆన్లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారాన్ని అపరిచితులతో పంచుకోవద్దని సూచించారు. సైబర్ నేరాలకు సంబంధించి 1930 హెల్ప్లైన్ నంబర్ను, అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్ను వినియోగించాలని తెలియజేశారు. మత్తు పదార్థాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, చెడు స్నేహితుల



ప్రభావానికి లోనుకాకుండా ఉండాలని హెచ్చరించారు. బాలబాలికల రక్షణకు అమల్లో ఉన్న పోక్సో చట్టం కింద ఉన్న కఠిన శిక్షల గురించి వివరించారు. అదేవిధంగా రోడ్డు భద్రత నియమాలు పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, హెల్మెట్ మరియు సీటుబెల్ట్ వినియోగం తప్పనిసరి అని పేర్కొన్నారు. మహిళలపై వేధింపులు, హింస, దౌర్జన్యాలు చోటుచేసుకున్నప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని ప్రోత్సహించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత, సమాన హక్కులు, విద్య ప్రాముఖ్యత వంటి అంశాలపై వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బాలికలు తమ ఆలోచనలు ధైర్యంగా వ్యక్తపరిచారు. మార్చి 8వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ తరహా కార్యక్రమాలు మహిళల్లో శక్తి, మానసిక స్థైర్యం, స్వీయరక్షణ సామర్థ్యాలను పెంపొందించేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ సిబ్బంది, ఇతర పోలీస్ అధికారులు, విద్యాసంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# రాయలచెరువు విరిగిపడి పంట నష్టం...

కేవీబీపురం మార్చి 2 జనసంఘర్షణ :




రాయలచెరువు తెగిపోవడంతో పంట పొలం పూర్తిగా నాశనం అయిందని, తీసుకున్న వ్యవసాయ రుణాలను మాఫీ చేసి భూమిని బాగు చేయించేందుకు ప్రభుత్వం ముందుకు రావాలని రైతు మునిరాజా విన్నవించారు. కేవీబీపురం తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం తహసిల్దార్ తనూజకు పాతపాలెం గ్రామానికి చెందిన రైతు మునిరాజా వినతిపత్రం సమర్పించారు. రైతు వివరాల ప్రకారం 2025 నవంబర్ 5న రాయలచెరువు తెగిపోవడంతో చెరువు కింద ఉన్న సుమారు ఒక ఎకరా తన సొంత పొలం తీవ్రంగా దెబ్బతిన్నది. ఆ సమయంలో వేసిన పంట పూర్తిగా కొట్టుకుపోయిందని తెలిపారు. వరద నీరు ఉద్ధృతంగా వచ్చి పొలంలో పెద్ద పెద్ద బండరాళ్లు తేలిపోవడంతో పాటు ఇసుక మేటలు పేరుకుపోయాయని, ప్రస్తుతం పంట సాగు చేయడానికి అసాధ్యంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయం కోసం భూమిని తాకట్టుపెట్టి తీసుకున్న రుణభారం తలపై ఉందని, పంట నష్టం కారణంగా అప్పులు తీర్చే పరిస్థితి లేదని చెప్పారు. భూమిని మళ్లీ సాగుకు అనుకూలంగా మార్చుకోవాలంటే భారీగా ఖర్చు అవుతుందని, అందుకు ప్రభుత్వ ఆర్థిక సహాయం అవసరమని విజ్ఞప్తి చేశారు. భూమి పునరుద్ధరణకు ప్రత్యేక నిధులు మంజూరు చేయడంతో పాటు, ఆ భూమిపై తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని వినతిపత్రంలో కోరారు. నష్టపోయిన రైతులను గుర్తించి ప్రభుత్వమే ముందడుగు వేసి సహాయం అందిస్తేనే తమలాంటి చిన్న రైతులు మళ్లీ నిలబడగలరని మునిరాజా పేర్కొన్నారు. ఈ సందర్భంగా తహసిల్దార్ తనూజ వినతిపత్రాన్ని స్వీకరించి, విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సమాచారం.

# భూ సమస్యలను పరిష్కరిస్తాం..

ఎస్ఆర్ పురం, మార్చి 02 ( జన సంఘర్షణ)



భూ సమస్యల పరిష్కరిస్తాం అని ఎస్ఆర్ పురం మండల తాసిల్దార్ లోకనాథ పిల్లై అన్నారు. సోమవారం ఎస్ఆర్ పురం మండల తాసిల్దార్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో 14 అర్జీలు వచ్చాయి. అందులో మ్యూటేషన్ కోసం రెండు అర్జీలు వచ్చాయి అలాగే రేషన్ కార్డు కావాలని ముగ్గురు అర్జీలు ఇచ్చారు. దారి సమస్య కోసం మూడు అర్జీలు ఇచ్చారు. ఆన్లైన్లో అడంగల్, వన్ బి కోసం ఇద్దరు అర్జీలు ఇచ్చారు. ఎఫ్ లైన్ పిటిషన్ కోసం ఇద్దరు అర్జీలు ఇచ్చారు. ఇంటి స్థలం కోసం ఇద్దరు అర్జీలు ఇచ్చారని తాసిల్దార్ తెలియజేశారు. వీటిని వారం రోజుల్లోగా పరిష్కరిస్తామని తాసిల్దార్ లోకనాథం పిళ్ళై తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ త్యాగరాజ్ ,ఆర్ఐ మహేష్, వీఆర్వోలు పాల్గొన్నారు.

# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

దొరవారిసత్రం, మార్చి 02 ( జన సంఘర్షణ)





మీ భూమి మీ హక్కు కార్యక్రమంలో భాగంగా తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం తొగరాముడి పంచాయతీలో సోమవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, ఆర్డీవో దేవేందర్ రెడ్డి రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని ఎన్నికల హామీలో భాగంగా రైతులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ, రైతులకు సకాలంలో విత్తనాలు, యూరియా అందించి రైతులు అభివృద్ధి చెందడంలో ప్రభుత్వ సహాయం ఎప్పటికీ ఉంటుందని, నియోజకవర్గంలో ఉన్న రెవెన్యూ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి గాని, ఆర్డీవో దృష్టికి గాని తీసుకుని వెళ్లి పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో దొరవారి సత్రం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు వేమసాని శ్రీనివాసులు నాయుడు, పట్టణ అధ్యక్షులు ఆకుతోట రమేష్, తాసిల్దార్, ఎంపీడీవో, రైతులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గజ వాహనంపై కళ్యాణ వెంకన్న అభయం

- **వైభవోపేతంగా జరుగుతున్న పుంగనూరు శ్రీ కళ్యాణ వెంకటరమణ స్వామి వారి బ్రహ్మోత్సవాలు..**

పుంగనూరు, మార్చి 02 ( జన సంఘర్షణ)



పుంగనూరు టీటీడీ పరిధిలోని శ్రీ కళ్యాణ వెంకటరమణ స్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవములులో భాగంగా ఏడవ రోజు సాయంత్రం స్వామి వారు గజ వాహనం పై కళ్యాణ వెంకన్నగా పుర వీధులలో తిరుగుతూ భక్తులను కటాక్షించారు.. వాహనం ముందు మంగళ వాయిద్యాలు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ వారి భజన కోలాట బృందాలు భజన, కోలాటాలు, డప్పు వాయిద్యాలు, ఆలయంలో అన్నమాచార్య ప్రాజెక్ట్ వారి సంగీత కార్యక్రమాలు వీనుల విందుగా, శ్రావణానందకరంగా సాగుతున్నాయి.. ఉదయం మరియు సాయంత్రం ఆలయంలో విశేష హోమ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.. పుర వాసులు అడుగడుగున స్వామి వారికి కర్పూర హారతులు సమర్పించారు. ఆలయంలో ఉదయం సాయంత్రం అన్నప్రసాద వితరణ గావిస్తున్నారని ఆలయ ఇన్స్పెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు

# వైద్యాధికారులు సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

**- హనుమకొండ డిఎంహెచ్వో డాక్టర్ ఏ అప్పయ్య**





**హనుమకొండ :**
వైద్యాధికారులు సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని హనుమకొండ డిఎంహెచ్వో. డాక్టర్. ఏ అప్పయ్య అన్నారు. సోమవారం డిఎంహెచ్వో డాక్టర్ ఏ.అప్పయ్య ఆధ్వర్యంలో కొండపర్తి, అయినవోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అవుట్ పేషంట్ ఇన్ పేషంట్ మందుల పంపిణీ మరియు ఇతర రికార్డులను పరిశీలించారు. మార్చి 31 లోగా ఎన్సీడీ స్క్రీనింగ్ పూర్తి చేయాలని అన్నారు. తనిఖీలో రెండు పీహెచ్సీలలో కూడా టి డి, యాంటీ రేబిస్ వ్యాక్సిన్ మరియు ఆంటీ స్నేక్ వీనం తగినంత మోతాదు అందుబాటులో ఉండడం గమనించడం జరిగింది అలాగే రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 100 డేస్ హెల్త్ మిషన్లో ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ,తేదీల షెడ్యూల్ ప్రకారం ప్రజలను స్క్రీనింగ్ క్యాంపులకు ప్రోత్సహించడం అలాగే తగిన పరీక్ష లు నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే హెచ్ పి వి వ్యాక్సిన్ వచ్చిన తర్వాత 14 సంవత్సరముల బాలికలకు వ్యాక్సినేషన్ కార్యక్రమం ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఐనవోలు పీహెచ్సీలో 24/7 మాతా శిశు సేవలు అందించాలని, ఆసుపత్రులకు వచ్చిన పేషంట్స్ తో మర్యాదగా ప్రవర్తించాలని,, వారికి మెరుగైన సేవలు అందించాలని, అధికారులు మరియు సిబ్బంది సమయపాలన పాటించాలని, లేనట్లయితే వారిపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన హెచ్చరించారు. ఆయనతోపాటు ఎన్సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీనివాస్ వైద్యాధికారి డాక్టర్ శ్యాం ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలి

**మేడ్చల్ జిల్లా ప్రజావాణిలో వినతి చేసిన ఏఐవైఎఫ్ బృందం**

**ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి**




**ఉప్పల్ :**
మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లాలో వేలాది మంది విద్యావంతులైన నిరుద్యోగ యువతకు పోటీపరీక్షల సన్నద్దత కోసం జిల్లా వ్యాప్తంగా ఉచిత కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని డిమాండ్చు చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) మేడ్చల్ జిల్లా సమితి ఆధ్యర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయం లోని ప్రజావాణి లో జిల్లా అదనపు కలెక్టర్ విజయందర్ రెడ్డి కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్బంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, కార్యదర్శి సల్మాన్ బేగ్,టి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ గ్రూప్ 1,2,3,4,ఎస్ఐ, కాన్స్టేబుల్, ఫైర్ మెన్, జైల్ వార్డెన్,స్కూల్ అసిస్టెంట్ తదితర పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువతకు సరైన శిక్షణా అవకాశాలు లేవని అన్నారు. పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే యువత కోచింగ్ సెంటర్లు లేక, ప్రైవేట్ కోచింగ్ సెంటర్లను ఆశ్రయిస్తే ఆ కోచింగ్ కేంద్రాల్లోని యాజమాన్యం విచ్చలవిడిగా ఫీజులు వసూళ్లు చేస్తున్నాయని,ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన యువతకు సరైన మార్గదర్శకత్వం మరియు శిక్షణ పొందలేకపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.దీని వల్ల గ్రామీణ మరియు పేద కుటుంబాలకు చెందిన యువతకు బాసట అవసరం అన్నారు.త్వరలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయనున్న జాబ్ క్యాలెండర్ అనుగుణంగా, ప్రస్తుతం పోటీ పరీక్షలు కోసం, సమగ్ర కోచింగ్ మరియు ప్రామానిత అధ్యయన కేంద్రాలను జిల్లాలో ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. అదే విధంగా కోచింగ్ సెంటర్లతో ఏర్పాటుతో పాటు నిష్ణాత అధ్యాపకులతో బోధన జరపాలని,పోటీ పరీక్షలకు ఆవసరమైన పుస్తకాలు, టెస్ట్ పేపర్లు అందుబాటులో ఉంచాలన్నారు.కోచింగ్ పొందాలనే అభ్యర్థులు జిల్లా ఎంప్లాయిమెంట్ శాఖ ద్వారా దరఖాస్తు చేసేలా ప్రణాళిక రూపొందించాలని వారు డిమాండ్ చేశారు.

# చిలుక నగర్ మోడల్ గ్రేవ్ యార్డ్ కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోండి

**-కొత్త కాంట్రాక్టర్ తో పెండింగ్ పనులను పూర్తి చేపియండి : ఎమ్మెల్యే బండారి**



**ఉప్పల్ :**
ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి చిల్కానగర్ డివిజన్లోని మోడల్ గ్రేవీ యార్డ్ కాంట్రాక్టర్ పై వెంటనే చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తో కలిసి ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రాధిక గుప్తాతో మాట్లాడు తూ చిలుకానగర్ మోడల్ గ్రేవ్ యార్డ్ కి 2 కోట్ల రూపాయల నిధులు శాంక్షన్ కావడం జరిగిందని కాంట్రాక్టర్ పనులు మొదలుపెట్టి సుమారు సంవత్సరం నర సమయం గడిచిన ఇంకా పనులు పూర్తి కాలేదని కాంట్రాక్టర్ కి ఆరు నెలల సమయంలో పని పూర్తి చేయాలని వర్క్ ఆర్డర్ ఉన్నా కూడా సంవత్సరం నర కాలంలో కూడా పనులు పూర్తి చేపట్టకపోగా పార్ట్ పేమెంట్ బిల్ పొందిన కూడా పనుల జాప్యం జరుగుతుందని జిహెచ్ఎంసి ఇంజనీరింగ్ విభాగం అధికారులు మూడు నోటీసులు ఇచ్చిన పట్టించుకోకుండా పనులు చేపట్టడం లేదని వెంటనే కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకొని వేరే కాంట్రాక్టర్ తో గ్రేవీ పనులు పూర్తి చేసి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా త్వరితగతిన పనులు పూర్తి చేసి గ్రేవి యార్డ్ ని ప్రజలకు అందుబాటులో తెచ్చే విధంగా చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్ కి తెలపడం జరిగింది. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ డివిజన్ నాయకులు ఎదుల కొండల్ రెడ్డి,జల్లి మోహన్, కోకొండ జగన్,ముద్దం శ్రీనివాస్ యాదవ్, బంటి, శ్యామ్,బాలు మొదలగువారు పాల్గొన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ చేసిన పరమేశ్వర్ రెడ్డి





**ఉప్పల్ :**
మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మాజీ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కంది శ్రవణ్ రెడ్డి ఆధ్వర్యంలో హబ్సిగూడ ప్రభుత్వ పాఠశాలలలో పదవ తరగతి చదువుతూ ఈ నెల 14 వ తారీఖున జరగబోయే పరీక్షలకు పరీక్ష సామాగ్రిని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి చేతుల మీదుగా విద్యార్థులందరికీ ఎగ్జామ్ పాడ్ పెన్ను పెన్సిల్ షార్నర్ రబ్బర్ స్కేల్ అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో హబ్సిగూడ జెడ్పిహెచ్ఎస్ స్కూల్ ప్రిన్సిపల్ పుష్ప,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కంది ఆగి రెడ్డి,డివిజన్ అధ్యక్షులు విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శ ధర్మేంద్ర నాయక్ (ధర్మా)ఏ' బ్లాక్ సెక్రటరీ మురళీ కృష్ణ ముదిరాజ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు వాసునాయక్,హబ్సిగూడా డివిజన్ రామాలయం చైర్మెన్ చింతలబాబురావు,సీనియర్ కాంగ్రెస్ నర్సింగ్ రావు,ఎస్టీ సెల్ మల్లు నాయక్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు గుండురాజన్న,డివిజన్ సెక్రటరీ సుమన్ జవీద్,నాయక్, సాయికిరణ్, లక్ష్మీనారాయణ, అధిగంగధర్, ఖలీం, రాజు, సాయి,పాల్గొన్నారు

# ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడం సమిష్టి బాధ్యత

- **జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై ప్రోగ్రాం అధికారులు, సిబ్బందితో సమీక్ష సమావేశం**
- **డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ హైదరాబాద్**
- **డాక్టర్ రవీంద్ర నాయక్**



**వరంగల్ :**
ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడం సమిష్టి బాధ్యత తీసుకోవాలని. డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ హైదరాబాద్ డాక్టర్ రవీంద్ర నాయక్, అన్నారు. సోమవారం వరంగల్ జిల్లా పర్వతగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పర్యవేక్షించి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు , ప్రోగ్రాం అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించి జిల్లాలో జరుగుతున్న జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను తెలుసుకొని ఈ క్రింది సూచనలు చేయడం జరిగినది. ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యాల వివరాల యొక్క ఘనాంకాలను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు ప్రజల అవసరాల కొరకు ప్రభుత్వము ఏర్పాటు చేసినవి అందులో పని చేస్తున్న ఆశా కార్యకర్త నుండి వైద్యాధికారి వరకు ప్రజలకు అందించవలసిన సేవలను సమయ పాలన పాటించి ఎలాంటి అంతరాయం కలగకుండా సేవలందించాలని సూచించారు. ప్రోగ్రాం అధికారులు ప్రతి మెడికల్ ఇన్స్టిట్యూట్ ను క్రమము తప్పకుండా పర్యవేక్షణలు చేస్తూ ఫలితాలు రాబట్టడానికి సిబ్బందిని ప్రోత్సహించాలని కోరారు. సంక్రమిత అసంక్రమిత వ్యాధుల పైన నిరంతరము సర్వేల ద్వారా తెలుసుకొని పరీక్షలు చికిత్సలు అందించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. మాతా శిశు ఆరోగ్య కార్యక్రమాలలో గర్భిణీ స్త్రీల నమోదు వ్యాధి నిరోధక టీకాల పట్టికలో సూచించిన విధంగా అవసరమున్న ప్రతి ఒక్కరికి అందించాలని తెలిపినారు. 14 సంవత్సరాల నుండి 15 సంవత్సరాల వయసు కలిగిన ఆడపిల్లలకు క్యాన్సర్ రాకుండా త్వరలో హెచ్. పి.వి వ్యాక్సిన్ ప్రారంభిస్తామని తెలిపారు.ప్రభుత్వ ప్రైవేటు ఆసుపత్రులలో సిజేరియన్ సెక్షన్లు జరగకుండా గర్భిణీ స్త్రీలకు వారి సంబంధిత కుటుంబ పెద్దలకు అవగాహన కల్పించి సాధారణ ప్రసవాలు జరిగేటట్లు చూడాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ప్రతి వ్యక్తి వారి ఉద్యోగ ధర్మాన్ని సక్రమంగా నిర్వహించాలని ప్రతిరోజు ప్రభుత్వం నిర్దేశించిన బయోమెట్రిక్ ఏ.బి.ఏ.ఎస్ సిస్టం ద్వారా అటెండ్ కావాలని, ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే వారిపైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ముందుగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు మరియు ప్రోగ్రాం అధికారులు పూల బొకేతో ఆహ్వానం పలకారు,ఈకార్యక్రమములో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి సాంబశివరావు, డిప్యూటీ డిఎం హెచ్వో డాక్టర్ ప్రకాష్,డాక్టర్ కొమురయ్య,ప్రోగ్రాం అధికారులు డాక్టర్ విజయ్ కుమార్, స్థానిక వైద్యాధికారిణి డాక్టర్ మౌనిక, పల్లె దవఖాన వైద్యాధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# మడికొండ డంపింగ్ యార్డుతో ఇబ్బందులు పడుతున్నారు ప్రజలు

- **మడికొండ డంపింగ్ యార్డ్ తరలింపే పరిష్కారం**
- **డంపింగ్ యార్డ్ తరలింపుకు ప్రజలందరూ ఐక్యమత్యంగా ఉద్యమించాలి**
- **డంపింగ్ యార్డ్ అడక్ కమిటీ మడికొండ**
- **జిల్లా కలెక్టర్కు గ్రీవెన్స్ లో వినతి పత్రం**





**హనుమకొండ**
మడికొండ గ్రామ పరిధిలో కొనసాగుతున్న డంపింగ్ యార్డు కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యార్డు వద్ద తరచూ చెత్తను కాల్చడం వల్ల భారీగా పొగలు వెలువడుతూ గ్రామమంతా వ్యాపిస్తున్నాయి. ఈ విషపూరిత పొగల కారణంగా ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు శ్వాసకోశ సమస్యలు, కళ్ల మంటలు, దగ్గు, అలర్జీలు వంటి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. డంపింగ్ యార్డు నుంచి వచ్చే దుర్వాసనతో పాటు పొగలు రాత్రివేళల్లో మరింత ఎక్కువగా వ్యాపిస్తుండటంతో ప్రజలు నిద్రపోవడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కూడా అస్వస్థతకు గురవుతున్నారని తెలిపారు. పర్యావరణానికి మరియు ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పుగా మారిన ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు.ఈ నేపథ్యంలో మడికొండ డంపింగ్ యార్డు బాధితులు సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పై ఐఏఎస్ ని కలిసి తమ సమస్యలను వివరించారు. సమస్య తీవ్రతను తెలియజేస్తూ వినతి పత్రం సమర్పించారు. డంపింగ్ యార్డులో చెత్తను కాల్చడాన్ని తక్షణమే నిలిపివేయాలని, శాస్త్రీయ విధానంలో చెత్త నిర్వహణ చేపట్టాలని కోరారు. అలాగే డంపింగ్ యార్డును జనావాసాలకు దూరంగా తరలించేందుకు చర్యలు తీసుకోవాలని లేదా ఆధునిక సాంకేతిక పద్ధతులతో చెత్త శుద్ధి కేంద్రంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే దిశగా వెంటనే అధికారులను ఆదేశించాలని కలెక్టర్ గారిని కోరారు. జిల్లా కలెక్టర్ సమస్యపై స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు బాధితులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు మహిళలు, యువకులు, వృద్ధులు పాల్గొన్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికే వరకు తమ పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మద్దెల ఎర్రగట్టు స్వామి, తొట్ల రాజు, పొనగోటి వెంకట్ రావు, పెండ్లి కృష్ణమూర్తి,కొలిపాక ప్రకాష్, స్వామి, కనక స్వామి, బిల్ల రవీందర్, తక్కెళ్ళపల్లి నిఖిల్ రావు, దువ్వ విజయ్, పెద్ది సత్యనారాయణ, దువ్వ సాంబరాజు, చట్ల అజయ్, అఖిల్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# పశువైద్య శిబిరం పశువులకు నట్టల నివారణ మందుల పంపిణీ

**-వినయ్ కుమార్**



**మాడుగులపల్లి:**
మండల పరిధిలోని ఇసుకబావిగూడెం గ్రామంలో పశుసంవర్ధక శాఖ పశుగణాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం గోపాలమిత్ర పశు వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరానికి గ్రామస్తుల నుండి విశేష స్పందన లభించింది.మండల పశువైద్యాధికారి డాక్టర్ వినయ్ కుమార్ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 62 గేదెలకు పరీక్షలు నిర్వహించి, వివిధ వ్యాధులను గుర్తించి వాటికి ఉచితంగా మందులు వైద్య సేవలు అందించారు. అదేవిధంగా, పశువుల ఎదుగుదలకు ఆటంకం కలిగించే నట్టల నివారణ కోసం 40 దూడలకు నట్టల నివారణ మందులను తాగించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కల్లూరి అనిత వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రైతులు తమ పశువుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఇలాంటి ప్రభుత్వ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్రులు నరేందర్, సందీప్, ప్రభాకర్,రైతులు మల్లాల లక్ష్మారెడ్డి, వల్లపు రెడ్డి వెంకట్ రెడ్డి, మేడి ప్రవీణ్, పుట్టల బిక్షం, తంగేళ్ల సంజీవరెడ్డి, మంచికంటి మధు రెడ్డి, రాచూరి వెంకటయ్య, వల్లందాస్ అశోక్ గ్రామస్తులు పాల్గొన్నారు.

జన సంఘర్షణ
మా లక్ష్యం సామాన్యుని పక్షం
తెలుగు దినపత్రిక
మంగళవారం
03 మార్చి 2026

## మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

**11 మంది డ్రైవర్లకు భారీ జరిమానా**




**మాడుగులపల్లి:**

రహదారి నిబంధనలు ఉల్లంఘించి, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై మాడుగులపల్లి పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. మాడు గులపల్లి ఎస్ఐ కృష్ణయ్య ఆధ్వ ర్యంలో శనివారం, ఆదివారం నిర్వ హించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 11 మంది ట్రక్కులు కంటైనర్ల డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డా రు.పట్టుబడిన ఈ 11 మంది నిందితులను సోమవారం మిర్యాలగూడలోని ఏడీఎం కోర్టులో మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టారు. కేసును విచారించిన మేజిస్ట్రేట్ వరుణ్ తేజ్ , నిందితులు సేవించిన మద్యం మోతాదును బట్టి జరిమానాలను విధిస్తూ తీర్పునిచ్చారు 100 ఎం జి /100ఎం ఎల్ కన్నా తక్కువ ఆల్కహాల్ శాతం ఉన్న వారికి: రూ. 2,500/- చొప్పున జరిమానా.100 ఎంజి /100 ఎం ఎల్ కన్నా ఎక్కువ ఆల్కహాల్ శాతం ఉన్న వారికి: రూ. 5,000/- చొప్పున జరిమానా విధించారు ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణయ్య మాట్లాడుతూ భారీ వాహనాలు నడిపే డ్రైవర్లు మద్యం సేవించడం వల్ల పెను ప్రమాదాలు జరిగి అమాయకుల ప్రాణాలు పోయే అవకాశం ఉందని వ్యక్తం చేశారు. నిబంధనలు అతిక్రమించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని, తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రాణ నష్టాన్ని నివారించాలని కోరారు.

## హోళి ప్రశాంతత వాతావరణంలో జరుపుకోవాలి:ఎస్సై విజయసింహారెడ్డి

**అన్నపురెడ్డిపల్లి :**




హోలీ పండుగను సాంప్రదాయబద్ధంగా, పరస్పర గౌరవంతో, ఎలాంటి అవాంఛ నీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించు కోవాలని మండల ప్రజలను కోరారు.హోలీ వేడుకల సంద ర్భంగా సహజసిద్ధమైన రంగులను మాత్రమే ఉపయోగించాలని, హానికర మైన రసాయనిక రంగులను వాడకూడదని సూచించారు. ఇతరులకు ఇబ్బందులు కలిగించే విధంగా బలవంతంగా రంగులు చల్లడం, నీటి బెలూన్లు విసరడం వంటి చర్యలు చేయరాదని హెచ్చరించారు. ప్రార్థనా మందిరాలు, ప్రజా ప్రదేశాలు, రహదారులపై వాహనదారులకు ఆటంకం కలిగించే విధంగా ప్రవర్తించవద్దని తెలిపారు.పండుగ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మండల వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు విస్తృతంగా నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. యువత వాహనాలను అతివేగంగా నడపకుండా జాగ్రత్తగా ఉండాలని, రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈత రాని వారు చెరువులు, కుంటలు, కాలువల వద్దకు వెళ్లకూడదని,చిన్నపిల్లలను అటువంటి ప్రదేశాలకు తీసుకెళ్లరాదని విజ్ఞప్తి చేశారు. లోతైన నీటిలోకి వెళ్లి ప్రమాదాలకు గురికాకుండా తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. మండలప్రజలందరూ పరస్పర గౌరవంతో, సురక్షితంగా హోలీ పండుగను జరుపుకొని పోలీసులకు సహకరించాలని ఎస్సై విజయసింహారెడ్డి కోరారు.

## మాజీ సర్పంచుల రాష్ట్ర అధ్యక్షులు వీరారెడ్డి ఏకగ్రీవం



**శంకరపట్నం:**

తెలంగాణ రాష్ట్ర మాజీ సర్పంచ్ల సమా వేశం మండల పరిధిలోని లింగాపూర్ గ్రామంలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర నలుమూలల జిల్లాలోని జిల్లాల మండలాల. గ్రామా ల మాజీ సర్పంచులు హాజరైనారు.ఈ సమావేశంలో మాజీ సర్పంచుల స్థితిగతులపై చేసిన అభివృద్ధి అంశాలపై చర్చించారు.అనంతరం. రాష్ట్ర కమిటీ అధ్యక్షునిగా కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం లింగంపూర్ మాజీ సర్పంచ్ ను ఏకగ్రీవంగా ప్రకటించారు.ఉపాధ్యక్షులుగా శ్యాం ప్రసాద్ వరంగల్ జిల్లా,శాంతయ్య మహబూబ్నగర్,రామేశ్వరరావు రవీందర్ ఆఫీస్ జనరల్ సెక్రటరీగా ప్రకటించారు. అదేవిధంగా కరీంనగర్ జిల్లా మాజీ సర్పంచ్ల భారతీయ ప్రజా ప్రతినిధుల మోర్చ అధ్యక్షునిగా చింతలపల్లె గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ పల్లెపాపిరెడ్డి . జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొత్తగట్టు గ్రామ మాజీ సర్పంచ్ ముకిరాల కిషన్ రావు ను ప్రకటించారు. రాష్ట్ర కమిటీ అధ్యక్షునిగా ఎన్నికైన వీరారెడ్డిని పాపిరెడ్డిని కిషన్ రావును మాజీ సర్పంచులు శాలువతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా భారతీయ సురక్ష సమితి ఆల్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్ యాదవ్ మాట్లాడారు. శక్తివంతమైన సమాజాన్ని ఏర్పాటు చేయుటకు కీలకంగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. మాజీ సర్పంచులు సమన్వయంతో జకముక్క రాయి లాంటి లాగా తయారై పల్లెల్లోవెలుగునివ్వాలన్నారు. గ్రామ పంచాయతీలకు సర్వహక్కులు కలిగి ఉండే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా హక్కుల సాధనకై పెద్ద ఎత్తున పోరాటాల నిర్వహిస్తామని ఆయన తెలిపారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు మాజీ సర్పంచులకు కావాల్సిన హక్కులపై పోరాటాలు నిర్వహిస్తామనిడిమాండ్ చేశారు.రాజకీయాలకు అతీతంగా పోరాటాల నిర్వహిస్తామని అన్నారు. రాజకీయపరమైన వ్యత్యాసాలు ఉన్న మార్గం ఒకటేనని ఆయన చెప్పారు ఈ కార్యక్రమంలో తెలంగాణలోని వివిధ జిల్లాల మండలాల, గ్రామాల.మాజీ సర్పంచులు హాజరైనారు.

## దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి

**కోరుట్ల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ మానుక ప్రవీణ్ కుమార్**

**కోరుట్ల :**

కోరుట్ల మండలం వ్యాప్తంగా కురిసిన అకాల వర్షం, ఈదురు గాలుల కారణంగా మామిడి, మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారని.. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుట్ల నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ మానుక ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. మొక్కజొన్న పంట నేలకూలి పూర్తిగా దెబ్బతిన్నదని, రైతులకు భారీ నష్టం సంభవించిందని తెలిపారు. అదనంగా మామిడి, తదితర పంటలు కూడా ప్రభావితమైనట్లు చెప్పారు. రైతులు అప్పులపాలై ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఈ అకాల వర్షం ఈదురు గాలులు మరింత కష్టాల్లోకి నెట్టిందన్నారు. మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించిన రైతుబంధు రైతులకు తక్షణం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే వ్యవసాయ అధికారులతో పంట



నష్టం అంచనా వేయించి, ప్రతి ఎకరాకు సరిపడ నష్ట పరిహారం ప్రకటించాలన్నారు. అలాగే, పంట బీమా కింద నమోదు చేసిన ప్రతి రైతులకు తక్షణమే బీమా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వ్యవసాయ రుణాలపై వడ్డీ మాఫీ చేయాలని, కొత్త రుణాలు వడ్డీ రహితంగా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతులను అన్ని విధాలుగా ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యతగా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. లేనిపక్షంలో తెలుగుదేశం పార్టీ



ఆధ్వర్యంలో ధర్నా రాస్తారోకో నిర్వహించి ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ స్థాయి తెలుగుదేశం పార్టీ నాయకులు ఎండి.రఫీ ఉద్దీన్, కొక్కుల మహదేవ్, ఎండి నదీమ్, ఇబ్రహీంపట్నం మండల్ టిడిపి నాయకులు గుజ్జుల రమేష్, మాధవ రెడ్డి, మారుతి, గంగారాం, నష్టపోయిన రైతులు భూమ గంగారాం, వేణుగోపాల్, శ్రీనివాస్, చిన్నయ్య, మహేష్, వెంకటేష్, నరేష్, సత్తన్న, శ్రీనివాస్, శేఖర్, లక్ష్మి, రాజవ్వ, పత్తిరెడ్డి, నరసయ్య, గంగారాం, వినోద్ తదితరులు పాల్గొన్నారు..

## లింగాలపల్లి ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించిన ఎమ్మెల్యే జారె

**కొత్తగూడెం :**

దమ్మపేట మండలం లింగాలపల్లి ప్రభుత్వ పాఠశాలను ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ఆకస్మికంగా సందర్శించారు ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా పాఠశాలలో నేరుగా తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు ఏ తరగతి చదువుతున్నారు భవిష్యత్తులో ఏమవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నారో తెలుసుకున్నారు. కొంతమందిని పాఠాలు చదివిస్తూ మరికొంతమందిని ప్రశ్నలు అడిగి వారి శక్తిని పరిశీలించారు. పిల్లలు ధైర్యంగా సమాధానాలు చెప్పడం పట్ల ఎమ్మెల్యే



సంతోషం వ్యక్తం చేశారు.ఈ పాఠశాలలో ఎమ్మెల్యే వరలక్ష్మి ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న సందర్భంలో కూడా ప్రత్యేకత ఏమాత్రం చూపకుండా



సాధారణంగానే పాఠశాల పనితీరును పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ బోధన విధానం విద్యార్థుల హాజరు శాతం పాఠశాలలో వసతులు తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు.

# గంజాయి పట్టివేత

**సుమారు పది లక్షలు 50 వేల విలువైన గంజాయి స్వాధీనం**

**చంద్రుగొండ :**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రగుండ మండలం పోలీస్ స్టేషన్ పరిధిలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా ఏపీ 39RV7906 నంబర్ గల హోండా షైన్ ద్విచక్ర వాహనంపై ముగ్గురు వ్యక్తులు ప్రయాణిస్తూ అనుమానాస్పదంగా కనిపించడంతో వారిని తనిఖీ చేయగా వారి దగ్గర మూడు బ్యాగుల్లో మొత్తం పది గంజాయి ప్యాకెట్లు సుమారు 21.150 కేజీలు ఉన్నట్లు గుర్తించారు. పట్టుబడిన ముగ్గురు వ్యక్తులను విచారించగా ఒడిస్సా రాష్ట్రం మల్కానగిరి జిల్లా అల్లూరికోట ప్రాంతం నుండి నిషేధిత 7 గంజాయిని బ్యాగులో ప్యాకెట్లుగా తరలిస్తూ భద్రాచలం- పాల్వంచ కొత్తగూడెం - చంద్రుగొండ -విజయవాడ మార్గంగా చెన్నైకు విక్రయించేందుకు భద్రాచలం నుండి విజయవాడకు వెళ్లే ఎన్ హెచ్ 30 రహదారిపై వెళ్తున్నారని తెలిపారు. ముద్దాయిల వివరాలు a1గా మేకల శ్రీనివాసరావు ఊర్మిళా నగర్ భవానిపురం విజయవాడ a2 కారం లక్ష్మయ్య గురుకుపల్లి మల్కానగిరి చమిలి బ్రాంచ్ తాలూకా ఒరిస్సా a3 మైనర్ బాలుడు మల్కానగిరి ఒడిస్సా వారి వద్ద నుంచి మొత్తం పది గంజాయి ప్యాకెట్లు ఉన్న 21.150 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. 2025 జనవరి నుండి ఇప్పటివరకు సుమారుగా 85 కేసుల్లో 33 కోట్ల 55 లక్షల రూపాయల విలువ గల 67 39 జిల్లా పోలీసులు స్వాధీనం చేసుకోవడం జరిగింది.




అంతేకాకుండా గంజాయి కేసులతో సంబంధం ఉన్న ముగ్గురు వ్యక్తులపై పిడిఎఫ్ చేసి జైలుకు తరలించడం జరిగింది. మరో ముగ్గురికి సంబంధించిన ఆస్తులను కూడా జప్తు చేయడం జరిగిందని తెలిపారు. మరి కొంతమంది పీడియాట్ నమోదు చేసేందుకు పోలీసులు జాబితా సిద్ధం చేస్తున్నారని తెలిపారు. ఇటు గంజాయిని పట్టుకోవడంలో కృషి చేసిన సీసీఎస్ ఇన్స్పెక్టర్ రమాకాంత్,ఎస్సైలు ప్రవీణ్,, రామారావు,చంద్రగొండ ఎస్సై శివరామకృష్ణ,మరియు వారి సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.




Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co